PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 87 | విజయవాడ, మంగళవారం 29 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 29 October 2024 | Rs



స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ - 1
పున : ప్రారంభం

2

దక్షిణాఫ్రికా పర్యటనకు
టీమిండియా కోచ్‌గా లక్ష్మణ్

మరోసారి
వెరీవెరీ స్పెషల్‌కు
అవకాశం



8

అధికారులదే బాధ్యత

- ఇసుకలో అక్రమాలు జరిగితే వారిపైనే చర్యలు
- బెల్ట్‌షాపులను అనుమతించొద్దు
- ఎంఆర్‌పికే మద్యం విక్రయాలు
- సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/ప్రత్యేక ప్రతినిధి

ఉచిత ఇసుక పథకంలో అక్రమాలు చోటుచేసుకుంటే అధికారులే బాధ్యత వహించాల్సిఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం ఆయన ఉచిత ఇసుక పథకంతో పాటు, మద్యం విధానంపైనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక విషయంలో ఎక్కడ అక్రమాలు జరిగినా అక్కడి అధికారులనే మొదట బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. తప్పులు నిర్ధారణయైతే వారిపైనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, దీనిని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారయంత్రాంగానికి ఆయన సూచించారు. పొరుగు రాష్ట్రాలకు ఒక్క లారీ ఇసుక కూడా తరలి పోవడానికి వీల్లేదని చెప్పారు. మద్యం షాపుల్లో ఎంఆర్‌పి కంటే ఒక్కరూపాయి ఎక్కువకు మద్యం అమ్మకాలు సాగించినా ఉపేక్షించవద్దని అన్నారు. ఎంపిఆర్‌పికి మించి అమ్మకాలు జరిపినట్లు రుజువైతే మొదటి సారి రూ.5లక్షలు ఫెనాల్టీ వేయాలని, తర్వాత కూడా ఆయా షాపుల్లో ఎక్కువకు అమ్మితే షాపు లైసెన్స్ రద్దు చేయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బెల్ట్ షాపులకు అనుమతించొద్దని అధికారులను ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మద్యం పట్ల కఠినంగా ఉండాలని, ఎన్‌డిపిఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) రాకుండా చూడాలని సిఎం ఆదేశించారు. ప్రతి షాపులో సిసి కెమెరాలు ఉండేలా చూడాలని, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబరు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ రెండు వ్యవస్థల పర్యవేక్షణకు సెంట్రల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఎం అధికారులకు సూచించారు. ప్రతి షాపు వద్ద మద్యం ధరల పట్టిక తప్పకుండా ఉండేలా చూడాలన్నారు. మద్యం షాపుల వద్ద ఆకస్మిక తనిఖీలు మద్యం అక్రమ నిల్వలపై దాడుల చేయాలని సూచించారు. మద్యం పాలసీ, ఇసుక విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ఉందని, దాన్ని క్షేత్ర స్థాయి వరకు సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందనిఅన్నారు. ప్రజల జేబులు గుల్ల చేసేలా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించాల్సినపనిలేదని సిఎం అధికారులకు స్పష్టం చేశారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

నిధులు సమీకరించండి : ఆర్థికశాఖపై సమీక్షలో సిఎం

రాష్ట్ర ఖజానాను నింపేందుకు నిధులు సమీకరించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖ అధికారులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థిక పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని ఆదాయ వనరుల శాఖల అధికారులను ఆదేశించిన నేపథ్యంలో వాటి పురోగతిపై ఆరా తీశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అనుగుణంగా ఆదాయం సమకూరడం లేదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

ప్రధానంగా వాణిజ్య పన్నుల శాఖ, మద్యం శాఖతోపాటు గనుల శాఖ నుంచి కూడా వచ్చే అదనపు ఆదాయంపై నివేదికలు సమర్పించాలని గతంలోనే ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో తాజా సమావేశంలో వాటి పురోగతిపై అధికారులు వివరించారు.

సబ్సిడీల రద్దు నిర్ణయం వాయిదా

ఇటీవల డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలోని బియ్యం సబ్సిడీ రద్దు, ప్రత్యామ్నాయంగా నగదు బదిలీపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. అయితే తాత్కాలికంగా ఈ సబ్సిడీ రద్దు అంశాన్ని పక్కన పెట్టాలని సమీక్షలో నిర్ణయించినట్లు సమాచారం. నివేదికలోని మిగిలిన అంశాలపై మాత్రం సానుకూలంగానే స్పందించినట్లు తెలుస్తోంది. జిఎస్‌టి, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు వంటి రంగాల్లో అవకతవకలను నివారించే దిశగా చర్యలు తీసుకుంటే కొంతవరకు ఆదాయం మిగిలే అవకాశాలు ఉంటాయని ఆర్థికశాఖ అధికారులు అభిప్రాయపడినట్లు తెలిసింది.

వచ్చే ఏడాదే జన గణన !

- కులగణనపై నిర్ణయం తీసుకోలేదు
- 31 అంశాలతో ప్రశ్నావళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనగణనను వచ్చే ఏడాది నుంచి చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. జనాభా లెక్కల సేకరణను మోడీ ప్రభుత్వం మూడేళ్లుగా నాన్చుతున్న సంగతి తెలిసిందే. జనాభా లెక్కలు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఆర్)ని నవీకరించే పని 2025 ప్రారంభంలో ప్రారంభిస్తే 2026 నాటికి గానీ డేటా రాకపోవచ్చు. దీంతో భవిష్యత్ జనాభా లెక్కల సేకరణ షెడ్యూల్ మారిపోతుంది. తదుపరి సెన్సస్ 2031కి బదులు 2035లో చేపడతారు.

జనాభా లెక్కలకు 31 ప్రశ్నలు

సాధారణ జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాలా వద్దా అనే విషయమై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జనాభా లెక్కల సేకరణ 1951 నుండి ప్రతి 10 సంవత్సరాలకొకసారి క్రమం తప్పకుండా నిర్వహించబడుతూ వస్తోంది. కరోనా మహమ్మారి వల్ల 2021లో జన గణన ఆగిపోయింది. ప్రభుత్వ అలసత్వంతో జనగణన అసలు జరుగుతుందా అన్న అనుమానం ఏర్పడింది. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం జనాభా గణన ప్రక్రియలో పౌరులను అడగడానికి 31 ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలిసింది.

కుల గణనపై నిర్ణయం తీసుకోలేదు

ఈ ప్రశ్నలలో మునుపటి జనాభా గణనలో అడిగినట్లుగా ఇంటి పెద్దలు షెడ్యూల్డ్ కులం లేదా షెడ్యూల్డ్ తెగ, ఇతర కుటుంబ సభ్యులకు చెందినవారా అనే అంశాలు ఉన్నాయి. దేశంలోని మొత్తం ఒబిసి జనాభాను తెలుసుకునేందుకు కుల గణనను ప్రతిపక్ష కాంగ్రెస్, వామపక్షాలు, ఆర్‌జెడి, డిఎంకె, ఎస్‌పి తదితర పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కుల గణనపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఒక అధికారి తెలిపారు.

వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాల వాకౌట్

- జెపిసి భేటీలో ఢిల్లీ బోర్డు ప్రతిపాదనలపై వ్యతిరేకత
- ప్రతిపాదిత సవరణలు రద్దు చేయండి : ఢిల్లీ సిఎం అతిషి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) సమావేశం నుంచి ప్రతిపక్ష ఎంపిలు వాకౌట్ చేశారు. జెపిసి ఛైర్మన్, బిజెపి ఎంపి జగదాంబిక పాల్ అధ్యక్షతన సోమవారం పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జెపిసి సమావేశం జరిగింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డు సమర్పించిన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఎంపిలు ఆ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ అనుమతి లేకుండానే.. ఢిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ మీటింగ్‌లో ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్ సింగ్, డిఎంకె ఎంపి మహమ్మద్ అబ్దుల్లా, కాంగ్రెస్ ఎంపిలు నసీర్ హుస్సేన్, మహమ్మద్ జావెద్, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి సమావేశం నుంచి వాకౌట్ చేసి తమ నిరసన తెలిపారు. అనంతరం కొంత సమయం తరువాత ఎంపిలు తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అనుమతి లేకుండానే వక్ఫ్ బోర్డు ప్రాథమిక నివేదికను పూర్తిగా మార్చేశారని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసిడి) కమిషన్, ఢిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ అశ్విని కుమార్‌పై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఈ సమావేశానికి టిఎంసి ఎంపి కళ్యాణ్ బెనర్జీ గైర్హాజరుతో గందరగోళం నెలకొంది. మరోవైపు వక్ఫ్ బిల్లుకు ప్రతిపాదించిన సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సోమవారం జెపిసికి లేఖ రాశారు. బిల్లుపై జెపిసి ఢిల్లీ ప్రభుత్వం నుంచి స్పందన కోరింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, అతిషి ఈ బిల్లును 'అనవసరం, వ్యర్థం' అని పేర్కొన్నారు.

గత మంగళవారం (అక్టోబరు 22) జరిగిన జెపిసి సమావేశంలో టిఎంసి ఎంపి కళ్యాణ్ బెనర్జీ అన్‌పార్లమెంటరీ ప్రవర్తన ఆరోపణలపై ఒకరోజు సస్పెండ్ అయ్యారు. ఆ ఘటనలో అద్దాలు పగిలి కళ్యాణ్ బెనర్జీ చేతికి గాయమైంది. కేంద్ర మైనారిటీశాఖ మంత్రి కిరన్ రిజిజు ఆగస్టు 8న లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లును తీవ్ర వ్యతిరేకత, గందరగోళం మధ్య ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిముల మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని పేర్కొంటూ ప్రతిపక్షాలు బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. సుదీర్ఘ చర్చ అనంతరం ఏకాభిప్రాయం కోసం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలని కేంద్రం నిర్ణయించింది.

లెబనాన్ పోర్టు సిటీపై బాంబుల వర్షం

- కొనసాగుతున్న ఇజ్రాయిల్ ఘాతుకాలు
- ఏడుగురు మృతి, 17మందికి గాయాలు

7

ప్రైవేట్ రంగంలో తొలి సైనిక విమాన ప్లాంట్

వడోదరలో ప్రారంభించిన మోడీ, శాంచెజ్

వడోదర : మిలిటరీ విమానాల తయారీకి సంబంధించిన టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్‌ను సోమవారం వడోదరలో ప్రధాని నరేంద్ర మోడీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ సంయుక్తంగా ప్రారంభించారు. సి295 విమానాన్ని ఇక్కడ రూపొందించనున్నారు. భారతదేశంలోనే మొట్టమొదటి మిలటరీ విమానాలను తయారుచేసే ప్రైవేట్ ప్లాంట్ ఇది. భారత్, స్పెయిన్ మధ్య భాగస్వామ్యం కొత్త దిశలో సాగుతోందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుతో రెండు దేశాల మధ్య సంబంధాలు బలోపేతమవడమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్ వూపందుకుంటుందని పేర్కొన్నారు. ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఇరువురు నేతలు సందర్శించారు. నూతన భారతదేశంలో నూతన పని సంస్కృతిని ఈ ఫ్యాక్టరీ ప్రతిబింబిస్తోందని మోడీ వ్యాఖ్యానించారు. ఏ ప్రాజెక్టు సంబంధించినదైనా ఆలోచన నుండి అమలు వరకు భారత్ ఎంత వేగంతో పనిచేస్తుందో ఈ ఫ్యాక్టరీలో చూడవచ్చని అన్నారు. 2022 అక్టోబరులో ఈ ప్లాంట్‌కు పునాది వేశారు. ప్రాజెక్టుల విషయంలో అనవసరమైన జాప్యాలను పూర్తిగా నిర్మూలించడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. భారత్‌లో ఇంత పెద్ద ఎత్తున రక్షణ తయారీ జరుగుతుందని దశాబ్ద కాలం క్రితం ఊహించను కూడా ఊహించలేదన్నారు. టాటా ఎయిర్‌బస్ ఫ్యాక్టరీ వల్ల వేలాది ఉద్యోగాలు కొత్తగా వస్తాయన్నారు. 18వేల విమాన భాగాల దేశీయ తయారీకి ఈ ఫ్యాక్టరీ తోడ్పాటునందిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా సంస్థలకు అపారంగా అవకాశాలు అందుతాయన్నారు. ప్రపంచంలోనే ప్రదాన విమాన కంపెనీలకు అవసరమైన విడి భాగాల ప్రధాన సరఫరాదారుల్లో భారత్ కూడా వుందన్నారు. ఎయిర్‌బస్ సి29 ఒక మోస్తరు రవాణా విమానం. దీన్ని తొలుత మిగతా 7లో



ప్రారంభోత్సవంలో మోడీ, పక్కన పెడ్రో శాంచెజ్

మున్సిపల్ టీచర్లకు ఉద్యోగోన్నతులు

- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ టీచర్లకు అడహక్ ఉద్యోగోన్నతులకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. మున్సిపల్ ఉపాధ్యాయులకు చివరగా 2017లో ఉద్యోగోన్నతులు కల్పించారు. ఏడేళ్ల తరువాత మరోసారి ఉద్యోగోన్నతులు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు విజయరామరాజు సోమవారం విడుదల చేశారు. సెకండరీ గ్రేట్ టీచర్ల (ఎస్‌జిటి)ను స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఎ)గా, ఎస్‌ఎలను గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం)గా ఉద్యోగోన్నతులు దక్కనున్నాయి. ఈ నెల 28వ తేదీన ఎస్‌ఎ, ఎస్‌జిటి, గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియర్ జాబితా విడుదలవుతుంది. ఈ జాబితాపై నవంబరు ఒకటి వరకు అభ్యంతరాలను పాఠశాల విద్యాశాఖ స్వీకరించి 4న తుది జాబితాను విడుదల చేస్తుంది. 6న హెచ్‌ఎంలకు, 8న ఎస్‌ఎలకు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ జరగనుంది. ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ షెడ్యూల్ ప్రకారం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించాలని డైరెక్టరు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉద్యోగోన్నతుల ఉత్తర్వుల పట్ల ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

వైసిపి బాటలో కూటమి సర్కారు

- విద్యుత్ చార్జీల పెంపు
- ఇసుక మాఫియా ఇష్టారాజ్యం
- విచ్చలవిడిగా మద్యం షాపులు
- కేంద్రం అన్యాయం చేస్తున్నా మాట్లాడని చంద్రబాబు
- వి శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి-పలాస(శ్రీకాకుళం)

వైసిపి బాటలోనే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా నడుస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో విద్యుత్‌తో పాటు వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపిందని చెప్పారు. ఆ భారాలను తగ్గిస్తామని, విద్యుత్ ఛార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు టిడిపి కూటమి ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ట్రూ అప్ పేరిట కరెంటు ఛార్జీలను 40 శాతం పెంచడానికి అనుమతి ఇవ్వడం దీనికి తాజా నిదర్శనమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రజలపై ప్రస్తుతం ఆరువేల కోట్ల రూపాయల భారం పడిందని, కొది నెలల్లో మరో 12 వేల కోట్ల రూపాయల భారం పడనుందని చెప్పారు. ఇసుక విషయంలో గతానికి భిన్నమైన పరిస్థితులేమి క్షేత్రస్థాయిలో లేవని అన్నారు. అప్పటిమాదిరే మాఫియా ఇష్టారాజ్యం కొనసాగుతోందని అన్నారు. ఉచిత ఇసుక పేరుకే పరిమితమైందని అన్నారు. మద్యం విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన మద్యం షాపులకు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగుతుండగా, మరోవైపు బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం చోద్యం చూస్తే మహిళలే ప్రతిఘటించాల్సి వస్తుందని, మరో సారా వ్యతిరేక ఉద్యమానికి వారే శ్రీకారం చుడతారని చెప్పారు. గత పదేళ్లుగా వెనుకబడిన ప్రాంతాలకు చేస్తున్న అన్యాయాన్నే బిజెపి ప్రభుత్వం ఇప్పుడూ కొనసాగిస్తోందని తెలిపారు. టిడిపిపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నా రాష్ట్రంపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోరాడకుండా కేంద్రం సాయం చేస్తోందని కోతలు కోస్తున్నారని విమర్శించారు. బిజెపికి కొరకరాని కొయ్యగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అధికారాన్ని అడ్డం పెట్టుకుని హైజాక్ చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. టిడిపి, జనసేన, వైసిపిలోని లౌకికవాదులు, కార్యకర్తలు బిజెపిని నిరోధించకపోతే మిగతా 7లో

15న కలెక్టరేట్లు, మండల కార్యాలయాల వద్ద ధర్నాలు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తప్పుడు విధానాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, దళితులు, గిరిజనులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి అంశాలపై సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలో నవంబరు ఎనిమిది నుంచి 15వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వి. శ్రీనివాసరావు తెలిపారు. పజా పోరు పేరుతో ఈ వారం రోజులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. పదహేనవ తేది రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు, మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

'ఫెర్రో'పై సర్దుబాటు పిడుగు

- ఒక్కో పరిశ్రమపై రూ.కోటికి పైగా భారం
- మూతదిశగా పరిశ్రమలు
- ఆందోళనలో కార్మికులు

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజాపాలన అందిస్తామని హామీ ఇచ్చిన టిడిపి కూటమి నేతలు.. అధికారం చేపట్టిన తర్వాత భారాలు మోపుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పేరుతో మోపిన భారాలను విమర్శించిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు.. నేడు అవే విధానాలను అవలంభిస్తున్నారు. తాజాగా విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పేరుతో పిడుగు పడడంతో ఫెర్రో పరిశ్రమలు గగ్గోలు పెడుతున్నాయి. రూ.కోట్లలో వడ్డన వేయడంతో నిర్వహణ సాధ్యం కాక ఫెర్రో పరిశ్రమలను మూసివేసేందుకు యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో 36 ఫెర్రో పరిశ్రమలున్నాయి. వాటిలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే 21 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం వాటిపై భారం వేసింది. ఒక్కో ఫెర్రో పరిశ్రమపై రూ.కోటి నుంచి రూ.10 కోట్ల వరకు భారం పడుతుంది. చిన్న పరిశ్రమపై కోటి రూపాయలకుపైగా భారం పడనుంది. 5 ఎంవిఎ సామర్థ్యం కలిగిన పరిశ్రమలో రోజుకు 26 మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి అవుతుంది. అక్కడ ఫర్నేస్‌కు లక్షా 4 వేల యూనిట్లు విద్యుత్తు వినియోగం అవుతుంది. దీంతో, రోజుకు రూ.1,87,200 చొప్పున నెలకు రూ.56.16 లక్షల వరకు భారం పడుతుంది. ఒక్కొక్క పరిశ్రమలో 2 నుంచి 10 ఫర్నేసుల వరకు ఉన్నాయి. రెండు ఫర్నేసులున్న పరిశ్రమకు రూ.కోటికిపైగా విద్యుత్తు భారం పడనుంది. పది ఫర్నేస్‌లుంటే ఆ పరిశ్రమపై విద్యుత్తు భారం రూ.6 కోట్ల పైమాటే. ఫర్నేస్ సామర్థ్యం ఎక్కువ ఉన్న పరిశ్రమలకు విద్యుత్తు వినియోగం కూడా పెరుగుతుంది. 2.5 ఎంవిఎ నుంచి 22 ఎంవిఎ సామర్థ్యం వరకుగల ఫెర్రో పరిశ్రమలు మిగతా 7లో



కొత్త యూనిట్లకు విద్యుత్ ధర

- నిర్ణయించిన ఎపిఇఆర్‌సి


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డిఎస్‌టిపిఎస్) స్టేజ్-1, స్టేజ్-2 యూనిట్లకు, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డా ఎన్‌టిపిపిఎస్) స్టేజ్-5 యూనిట్లకు విద్యుత్ ధర నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఉత్తర్వులు విడుదల చేసింది. 2024-2029 కాలానికి సంబంధించిన టారీఫ్‌ను నిర్ణయించింది. ఎస్‌డిఎస్‌టిపిఎస్ స్టేజ్-1కు యూనిట్ ధర రూ.4.06లకు అనుమతి ఇవ్వాలని జెన్‌కో ప్రతిపాదించింది. దీంతో పాటు మరో 15 శాతం పెంచుకునే అవకాశం ఇవ్వాలని కోరింది. అయితే కమిషన్ రూ.3.80లకు అనుమతినిచ్చింది. స్టేజ్-5కు యూనిట్‌కు రూ.3.01లతో పాటు దీనికి అదనంగా 15 శాతం పెంచుకునే అవకాశం ఇవ్వాలని జెన్‌కో ప్రతిపాదించగా రూ.3.20లకు కమిషన్ అనుమతినిచ్చింది. ఎస్‌డిఎస్‌టిపిఎస్ స్టేజ్-5కు యూనిట్ ధర రూ.3.50లకు అనుమతినివ్వాలని జెన్‌కో కోరగా, కమిషన్ రూ.3.34లకు నిర్ణయించింది.

జపాన్ ఎన్నికల్లో పాలక పార్టీ పరాజయం

- హంగ్ పార్లమెంటు

టోక్యో : ఆదివారం జరిగిన ఎన్నికల్లో జపాన్ పాలక పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కుంభకోణాలతో కళంకితమైన ప్రధాని షిగెరు ఇషిబా ప్రభుత్వాన్ని ఓటర్లు తిరస్కరించారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. ఇషిబా రాజీనామా చేస్తారన్న వార్తలొచ్చినప్పటికీ, ఆయన మాత్రం కుర్చీని అంటిపెట్టుకుని ఉన్నారు. ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన జపాన్‌లో ప్రభుత్వ ఏర్పాటు అనిశ్చితిలో పడింది. పాలక ఎల్‌డిపి పార్టీ ఇంతటి దారుణ ఓటమిని చవి చూడడం 2009 తరువాత ఇదే మొదటిసారి. ఈ సారి హంగ్ ఏర్పడడంతో జపాన్ కరెన్సీ యెన్ మూడు మాసాల కనిష్టానికి పడిపోయింది. ఈ రాజకీయ అనిశ్చితి జపాన్‌ను కొన్ని వారాలపాటు వెంటాడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్థికపరంగా, భద్రతా పరంగా చాలా సంక్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇటువంటి ప్రతిష్టంభనను మనం ఎంతమాత్రమూ అనుమతించలేమని ఓడిపోయిన ప్రధాని ఇషిబా వ్యాఖ్యానించారు. తాను ప్రధానిగా కొనసాగుతానన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. పార్లమెంట్ దిగువ సభలో మొత్తం 465 స్థానాలకు గాను ఇషిబా లిబరల్‌డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి), దాని సంకీర్ణ భాగస్వామి కొమెటోకు కలిపి 215సీట్లు మాత్రమే వచ్చాయి. .ఈ కూటమి గత సారి ఎన్నికల్లో 279సీట్లు సాధించింది. పెరుగుతున్న జీవన వ్యయ సంక్షోభమే ఈ ఓటమికి ఒక ముఖ్య కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇద్దరు మంత్రులు, కొమెటో నేత కూడా పరాజయం పాలయ్యారు. ప్రధాన ప్రతిపక్షం కానిస్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ (సిడిపిజె)కు గతంలో 98వుండగా ఈసారి 148సీట్లు గెలుచుకుంది. అయితే ఈ కూటమికి కూడా మెజారిటీకి కావాల్సిన 233 సీట్లు రాలేదు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం 30రోజుల్లోగా ఈపార్టీలు పాలించే కూటమిని రూపొందించుకోవాల్సి వుంటుంది. నెల రోజుల క్రితమే ఇషిబా ప్రధాని పదవి చేపట్టారు. ఈ పరిస్థితుల్లో ఆయన ఎంతకాలం పదవిలో వుంటారో స్పష్టంగా తెలియడం లేదు. కాగా తాము కూడా ఇతర పార్టీలతో చర్చలు జరిపి ఒక నిర్ణయానికి రావడానికి కృషి చేస్తామని సిడిపిజె నేత యోషిహికో నోడా చెప్పారు.



ప్రధాని షిగెరు ఇషిబా

ఒకటిన విశాఖలో రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. విశాఖపట్నంలో నవంబరు ఒకటిన జరిగే ఈ కార్యక్రమం పోస్టరును విజయవాడలోని భసవపున్నయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఎ అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న, పిడిఎస్ రాష్ట్ర నాయకులు రాజేష్, ఎవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు గోవిందరాజులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంటు 32 మంది ప్రాణత్యాగాలు, వేలాది మంది రైతుల త్యాగాలతో ఏర్పడిందన్నారు. నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయాలని దుర్మార్గపు ఆలోచన చేస్తుందన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టేశారని, ఇప్పుడు నష్టాల్లో ఉంది కాబట్టి అమ్మేస్తున్నామని కుంటి సాకులు చెబుతుందన్నారు. విభజన హామీల్లో భాగంగా కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పినా, నేటి వరకూ దీని నిర్మాణం ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కేంద్రంపై ఈ విషయంలో ఒత్తిడి తేవాలన్నారు.

పేదలపై విద్యుత్ భారం మోపింది జగనే

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి పేదలపై భారం మోపారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఇప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుపై జగన్ మాట్లాడటం సిగ్గుచేటని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఎపిని అప్పగిస్తే వ్యక్తిగత స్వార్థంతో నాశనం చేసింది నిజం కాదా? అని జగన్‌ను ప్రశ్నించారు. అసమర్ధ పాలన, అస్మదీయులకు దోచిపెట్టింది వాస్తవం కాదా? అని పేర్కొన్నారు. 2022-23, 2023-24 ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కమ్‌లకు అనుమతినిచ్చింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. జగన్ తప్పిదాలతో అనవసరంగా హిందూజా పవర్‌కు రూ.1,200 కోట్లు చెల్లించారని విమర్శించారు.

ఏడిదలో బాణసంచా పేలుడు

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మండపేట(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో ఒక పెంకుటింట్లో బాణసంచా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇళ్లు పూర్తిగా శిథిలమైంది. ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడిద పంచాయతీ కార్యాలయం సమీపంలో కల్లు వెంకటకృష్ణ తన భార్య, తల్లిదండ్రులతో కలిసి పెంకుటింట్లో ఉంటున్నారు. దీపావళికి ఔట్లు తయారు చేసేందుకు మందుగుండు సామగ్రిని ఇంట్లో నిల్వ ఉంచారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఒక్కసారిగా పెద్దశబ్దంతో పేలుడు సంభవించింది. శబ్దానికి చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులయ్యారు. పేలుడు ధాటికి పెంకుటిల్లు పైకప్పు కుప్పకూలింది. వెంకటకృష్ణ, ఆయన భార్య జయశ్రీ తీవ్రంగా గాయ పడ్డారు. స్థానికులు వారిని మండపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటకృష్ణ (30) మృతి చెందారు. జయశ్రీని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామకృష్ణ తండ్రి శ్రీనివాస్, సావిత్రి గాయాలతో బయటపడ్డారు. రూరల్ ఎస్ఐ సురేష్ బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి కొనుగోలులో అక్రమాలు

- అరికట్టాలని ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పత్తి కొనుగోలులో వ్యాపారుల అక్రమాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. పత్తి అమ్మేందుకు మార్కెట్‌కు వచ్చిన రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా వ్యాపారులు ధరలు తగ్గించి తీవ్ర నష్టం కల్గిస్తున్నారని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది క్వింటాలుకు రూ.12 వేలు పలికిన ధర ఇప్పుడు ప్రారంభంలోనే రూ.10 వేలు ఉందని తెలిపారు. క్రమంగా తగ్గిపోతుందన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 ఖరీఫ్ సీజన్‌లో క్వింటాలు పత్తికి రూ.7,521లు మద్దతు ధరగా ప్రకటించిందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కూడా అమలు చేయని వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్తి కొనుగోలు చేయకుండా కాలం వెళ్లదీస్తోందని, పరోక్షంగా వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సిసిఐ తక్షణమే పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.10 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మె ఒప్పందాలు అమలు ఇంకెప్పుడు?

- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు
- రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఆందోళన



విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్మిస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంత వరకూ సమస్యలు పరిష్కరించకపోవడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఒప్పందాలను అమలు చేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ఆందోళనకు దిగారు. కార్పొరేషన్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తగినంతమంది పారిశుధ్య సిబ్బందిని నియమించాలని, డెత్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. గుంటూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె కాలం జీతం, పండగ కానుక రూ.1000 వెంటనే కార్మికులకు చెల్లించాలని, సమ్మె కాలం ఒప్పందాల జిఒ వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలం ఒప్పందాలకు జిఒలు జారీ చేయాలని మున్సిపల్ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, డిఎంఎలను అనేకమార్లు కలిశామని, వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. అయినా, సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో, ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే కలిసి వచ్చే సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి, పల్నాడు జిల్లా మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్లల్లో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ నగరంలోని అన్ని జోనల్ కార్యాలయాల వద్ద, అనకాపల్లి పట్టణంలోని జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. జివిఎంసి కమి షనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవా ధ్యక్షులు పి.వెంకట రెడ్డి, అధ్యక్షులు టి.నూక రాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు మాట్లాడారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరిం చకపోతే సమ్మెకు దిగుతా మని హెచ్చరించారు.

మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నగర గౌరవాధ్యక్షులు ధోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ డివిజన్లో విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను అన్ని విభాగాల్లో కూడా పెంచాలని డిమాండ చేశారు. సిపిఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు మద్దతు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండపేట, కాకినాడ జిల్లాలో తుని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఒంగోలు నగర కార్యదర్శి టి.విజయ అధ్యక్షత వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, తణుకు మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. కడప నగర పాలక సంస్థ, రాజంపేట, జమ్మలమడుగుల్లో నిరసన తెలిపారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ ప్రసంగించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి, హిందూపురం, అనంతపురం జిల్లాలో అనంతపురం కార్పొరేషన్, కల్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, గుంతకల్లు మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు బైఠాయించారు. నెల్లూరు కార్పొరేషన్ వద్ద ధర్నాలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోని టిడిపి ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యధోరణి అవలంభిస్తోందని, దీనిని విడనాడాలని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు ధర్నా చేశారు. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయాల ధర్నా చేసి అధికారులకు వినతులు ఇచ్చారు. కర్నూలు కార్పొరేషన్, నంద్యాల, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికులు నిరసన తెలిపారు.

కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ కార్మికుల బైఠాయింపు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మార్కాపురం మున్సిపాలిటీలో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని గత 14 రోజులుగా ఆందోళన కొనసాగుతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో మున్సిపల్ ఛాంబర్‌ను సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ నుండి సరైన సమాధానం రాకపోవడంతో సిఐటియు నాయకులతో పాటు కార్మికులు కమిషనర్ ఛాంబర్‌లో బైఠాయించారు. దీంతో పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబుకు కమిషనర్ సమాచారమిచ్చారు.

ఆందోళన విరమింపజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. 'మా కడుపు కొట్టొద్దు సార్..' అంటూ వారు ఆయన కాళ్లపై పడ్డారు. ఎప్పటి నుంచో ఇదే పని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, తామంతా ఆప్కాస్‌లో ఉన్నామని, అక్రమంగా తమను తొలగించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ప్రాధేయపడ్డారు. ఈ తొలగింపులు అక్రమమో... సక్రమమో... ఒకటి రెండు రోజుల్లో జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించేంత వరకు వేచి ఉండాలని, అప్పటి వరకు ఆందోళన చేయవద్దని కమిషనర్ నారాయణ సమాధానం ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు



స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్-1 పునః ప్రారంభం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఆరు నెలల క్రితం ముడి సరుకు అందక మూతపడిన బ్లాస్ట్ ఫర్నేస్ - 1 (గోదావరి)ని ఉక్కు కార్మికుల అనేక ఆందోళనల నేపథ్యంలో తిరిగి సోమవారం ఉదయం పున : ప్రారంభమైంది. దీంతో నెలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అదనంగా జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. సోమవారం ఉదయాన్నే ఈ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్లాంట్ సిఎమ్‌డి ఎకె.సెక్సేనాతో పాటు పలువురు అధికారులు ప్రారంభించారు. ముడిసరుకు అందుబాటులో లేకపోవడం, ఆర్థిక సమస్యల దృష్ట్యా ఈ ఫర్నేస్ మూతపడింది. వాస్తవానికి స్టీల్‌ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉన్నాయి. ఆదివారం వరకూ బ్లాస్ట్ ఫర్నేస్ - 2 (కృష్ణా) మాత్రమే నడిచింది. ఇప్పుడు దీనికి బ్లాస్ట్ ఫర్నేస్ - 1 (గోదావరి) తోడైంది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను రెండేళ్ల క్రితమే నిలిపివేసిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రారంభమైన బ్లాస్ట్ ఫర్నేస్‌ను అంతరాయం లేకుండా కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, సమయానికి జీతాలు అందేలా చూడాలన్నారు.

'ఉక్కు' సమస్యలపై మహాధర్నా



మహాధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, నిలిపివేసిన హెచ్‌ఆర్ఎను తక్షణమే చెల్లించాలని, ఉక్కు టౌన్‌షిప్‌లో నివాసముంటున్న వారికి పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన సోమవారం స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉద్యోగులు మహాధర్నాకు దిగారు. తమ సమస్యలపై నినదించారు. వారినుద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్ - 1ను ప్రారంభించడం కార్మికుల విజయమన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతోనే పరిరక్షించుకోవాలని కోరారు. నవరత్న హోదా పొందిన స్టీల్‌ప్లాంట్ నేడు కేంద్రం చేతుల్లో నలిగిపోతోందని అన్నారు. పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కార్మిక వ్యతిరేక విధానాలకు ఉక్కు యాజమాన్యం పాల్పడుతోందన్నారు. ఏకపక్షంగా సుమారు ఏడు వేల మంది ఉక్కు ఉద్యోగులకు హెచ్‌ఆర్ఎను రద్దు చేసిందని, ఉక్కు టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఐదు వేల మందికి విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచేసిందన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూ ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. విఆర్ఎస్ పేరుతో కార్మికులను తగ్గించాలని చూడడం సరైంది కాదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కెఎస్ఎన్.రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, మసేన్‌రావు, నరేష్ కుమార్, కె.రాజబాబు, నీరుకొండ రామచంద్రరావు, పివి.రమణమూర్తి, విల్లా రామ్మోహన్ కుమార్, గణపతి రెడ్డి, దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఏర్పాటు చేయండి

- అగ్రిగోల్డ్ బాధితుల ధర్నాలో రామకృష్ణ



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే అఖిలపక్ష నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో మహా విజ్ఞాపన దీక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల పక్ష నేతల సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు సమర్థ వంతమైన అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. పదేళ్లగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. నిబద్ధత కలిగిన విశ్రాంత ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు లాంటి అధికారులతో క మిటీ వేస్తే సత్వరమే సమస్య పరిష్కారమవుతుం దన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు మాట్లాడుతూ త్వరలో జరుగనున్న శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో వాయిదా తీర్మానం ద్వారా అగ్రిగోల్డ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటాలకు అండగా ఉంటామన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వర రావు(వైవి) మాట్లాడుతూ ఐక్యంగా పోరాటాలు చేస్తే ప్రభుత్వాలు దిగిరాక తప్పదన్నారు. అగ్రిగోల్డ్ సమస్య కొన్ని లక్షల కుటుంబాలకు సంబంధించిన సమస్యగా ప్రభుత్వం గుర్తించి సత్వరమే సమస్యను పరిష్కరించాలన్నారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడితే ఈ సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావుల పల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఒకే ఒక లక్ష్యంగా పోరాటం చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందన్నారు. అమరావతి బహుజన జెఎసి అధ్యక్షులు బాలకోటయ్య మాట్లాడుతూ మోసం చేసిన కంపెనీ ఆస్తులు అమ్మి సమస్యను పరిష్కరించాలని కోరటం న్యాయమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, అధ్యక్షులు ఇవి నాయుడు, కార్య నిర్వాహక అధ్యక్షులు ఎస్ మల్లికార్జున, ఉప ప్రధాన కార్యదర్శి బివి చంద్రశేఖర్ పాల్గొన్నారు. సాయంత్రం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య శిబిరాన్ని సందర్శించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అనంతరం దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

మహిళా విఆర్‌ఎలకు నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు రద్దు

- ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళా విఆర్‌ఎలకు నైట్ వాచ్‌మెన్ డ్యూటీల నుంచి మినహాయింపునిస్తూ సిసిఎల్ఎ జయలక్ష్మి ఉత్తర్వులివ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం (గ్రామ సేవకుల సంఘం) పేర్కొంది. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నైట్ డ్యూటీల నుంచి మహిళా విఆర్‌ఎలను మినహాయించాలని తాము అక్టోబరు 21న ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తరపున వినతిపత్రం ఇచ్చినట్లు గుర్తుచేశారు. తమ వినతిపై స్పందించిన సిసిఎల్ఎ మహిళా విఆర్‌ఎలకు నైట్ డ్యూటీల నుంచి మినహాయిం పునిస్తూ ఉత్తర్వులిచ్చారన్నారు. పేస్కేల్, ప్రమోషన్ల విషయాలపై ఫైల్ సిద్ధమవుతున్న ట్లు సమాచారం ఉందన్నారు. విఆర్ఎల సమస్యల పరిష్కారం కోసం విఆర్‌ఎలందరూ కలిసికట్టుగా నవంబరు 4 నుంచి 18వ తేదీ వరకు సంఘం పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలన్నారు.


విశాఖ భూపేష్ నగర్‌లో మద్యం షాపును వ్యతిరేకిస్తూ నినదిస్తున్న రమాదేవి, స్థానిక మహిళలు

ఇష్టారీతిన మద్యం షాపుల పెంపు

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు టిడిపి కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం దారుణమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ఈ చర్యను మహిళాలోకం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. విశాఖ జివిఎంసి 34వ వార్డు భూపేష్ నగర్‌లో కొత్తగా మద్యం షాపును ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక మహిళలు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఆ దీక్షలకు రమాదేవి మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపుల సంఖ్యను విపరీతంగా పెంచడమే కాకుండా.. మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజలు వ్యతిరేకించిన చోట మద్యం షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన మద్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం శోచనీయమన్నారు. మద్యంలో నాణ్యత ఏమిటని ప్రశ్నించారు. ఎన్‌టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఎపిలో మద్య నిషేధం అమలు చేశారని, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన చంద్రబాబు నాయుడు దానికి తూట్లు పొడిచి, రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్ మద్యం దుకాణాలను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారని అన్నారు. ఒక్క విశాఖ జిల్లాలోనే 400 వరకు మద్యం దుకాణాలను అదనంగా ఏర్పాటు చేసినట్టు సమాచారమని, ఇదే పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. 11 రోజులుగా మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తున్న మహిళల గోడును ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. భూపేష్ నగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయబోమని చెప్పే వరకు ఆందోళన కొనసాగుతుందని, దీనికి ఐద్వా సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి, జగదాంబ జోన్ కార్యదర్శి వరలక్ష్మి, స్థానికులు ఎరుకమ్మ, లక్ష్మి, భారతి, హుస్సేన్ పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై దాడిని ఖండించిన వామపక్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీ మాజీ సిఎం కేజ్రీవాల్‌పై దాడిని వామపక్ష పార్టీల తరపున ఖండిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు (వైవి), మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆమ్ ఆద్మీ నాయకులు నేతి మహేశ్వరరావుతో కలిసి విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ఢిల్లీలో రూ.100 కోట్ల మద్యం స్కాం జరిగిందంటూ రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల్లో రూ.వేలకోట్లు మద్యం స్కామ్‌లు జరిగినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. జమిలీ ఎన్నికలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిలబెట్టుకోవడానికి, రాజ్యాంగాన్ని, లౌకిక వాదాన్ని కాపాడుకోవడానికి ప్రజాతంత్రవాదులు, కమ్యూనిస్టులు, ఇతర అన్ని తరగతుల వారూ ముందుకు రావాలని కోరారు. వై వెంకటేశ్వరరావు (వైవి) మాట్లాడుతూ.. ఢిల్లీలో ఈ నెల 27న మాజీ సిఎం కేజ్రీవాల్‌పై దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోడీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. తన ప్రభుత్వంపై ఎవరైనా విమర్శలు చేస్తే సహించలేరని, వారిని ప్రభుత్వ వ్యవస్థలను ఉపయోగించి వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గతంలో రైతు ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించారని గుర్తు చేశారు. అనేక విశ్వవిద్యాలయాల్లో ఉద్యమాలను అణచివేస్తున్నారని చెప్పారు. ప్రొఫెసర్ సాయిబాబాను అన్యాయంగా పదేళ్లపాటు జైలులో పెట్టి హింసించారని, చివరికి న్యాయస్థానం ఆయన నిర్దోషి అని తేల్చిన అనంతరం విడుదల చేశారన్నారు. కేంద్రం వేధింపుల వల్ల ఆయన ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. జార్ఖండ్ సిఎంపైనా ఇదేవిధంగా కేసులు పెట్టి హింసించారని తెలిపారు. ఢిల్లీలో మూడు సార్లు బిజెపిపై విజయం సాధించడంతో కేజ్రీవాల్‌పై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రాజ్యాంగానికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేజ్రీవాల్‌ను జైలులోనే ఉంచాలని ఎంతో ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. ఆయనపై దాడికి పాల్పడటం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. మాజీ సిఎంపై దాడి చేస్తే పోలీసులు అచేతనంగా ఉండటం సరైంది కాదని తెలిపారు. దేశంలో లౌకికవాదానికి ముప్పు ఏర్పడుతుందని కెనడా ఇటీవల వెల్లడించిందన్నారు. బిజెపి విషయంలో సిఎం చంద్రబాబు పునరాలోచన చేయాలని కోరారు. చివరకు సహకార రంగాన్ని కూడా తన గుప్పెట్లో పెట్టుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ జోన్ సి కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో డబ్బు, మద్యం, అవినీతి రాజకీయాలను నడిపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, అవినీతి రహిత పాలన ఇచ్చిన ఘనత కేజ్రీవాల్ సొంతమన్నారు. సామాన్యులను చట్టసభలకు పంపి ముఖ్యమంత్రులను చేసిన కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని 2014 నుంచి బిజెపి దాడులకు పాల్పడుతుందన్నారు. ఈ సమావేశంలో ముస్లిం లీగ్ పార్టీ నాయకులు ఖాజావలి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ, వేదికపై వి.రాంభూపాల్

శ్రమ జీవులను ఐక్యపరచడమే లెనినిజం

- పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభాలమయం
- లెనిన్ శతవర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రమ జీవులను ఐక్యపరచడం...వారిని పోరాటాల వైపు నడిపించడమే లెనినిజమని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. లెనిన్ శతవర్ధంతి సభను అనంతపురం ఎన్‌జిఒ హోంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 'లెనినిజం-నేటి సవాళ్లు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఎంవిఎస్.శర్మ ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ సంక్షోభాల మయమేనని పేర్కొన్నారు. ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకు పడిపోతూ ఉందన్నారు. పాలకులు ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా కాకుండా పెట్టుబడిదారులకు ఏ విధంగా లాభాలు చేకూర్చిపెట్టాలన్న వైపు మాత్రమే ఆలోచిస్తూ ఉన్నారని వివరించారు. ఈ విధానంలో మార్పు రానంత వరకు పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలోనే ఉంటుందన్నారు. ఈ సంక్షోభ సమయంలో కార్మిక హక్కులు మరింతగా హరించబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో కార్మిక వర్గాన్ని మేల్కొలిపి పోరాటాలకు సన్నద్ధం చేయాల్సిన అవసరముందని సూచించారు. కులాలు, మతాల వారీగా దేశం విడిపోయిందని, వారందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాటాలకు సన్నద్ధం చేసే విధంగా కృషి చేయాల్సిన అవసరముందని వివరించారు. వ్యక్తుల మధ్య, వ్యవస్థల మధ్య అనేక భిన్నాభిప్రాయాలున్నా దేశ స్వాతంత్రోద్యమ లక్ష్యం కోసం ఏకతాటిపై నిలబడి పోరాడి సాధించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పుడూ అదే స్ఫూర్తితో శ్రమ జీవుల సమస్యలపై సాధ్యమైనంత ఎక్కువ మందిని సమీకరించి పోరాటాలకు సన్నద్ధం చేయాల్సి ఉంటుందని చెప్పారు. మీడియా ప్రభావం ప్రజలపై ఎక్కువగా ఉందని, అదే సమయంలో భయాలూ ఉన్నాయన్నారు. వాటిని పారదోలి పోరాటాల్లోకి జనం వచ్చే విధంగా కృషి జరగాలని సూచించారు. లెనినిజం ప్రధాన ఉద్దేశం కూడా అదేనని పేర్కొన్నారు. శ్రమ జీవులను ఐక్యపరచడం, వారిని పోరాటాలకు సన్నద్ధం చేయడమేనని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, ఎస్.ఎం.బాషా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సిపిఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణ అధికారి గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - వీరవాసరం



రాజకుమార్ (ఫైల్)

పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామానికి చెందిన నరసాపురం డివిజనల్ మలేరియా అధికారి కంచిపూడి రాజకుమార్ (54) గుండెపోటుతో మృతి చెందారు. రాజకుమార్‌కు ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు పాలకొల్లులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుల తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, తల్లి ఉన్నారు. రాజకుమార్ మృతదేహాన్ని ఉమ్మడి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్‌రావు, ఇన్‌ఛార్జి డిఎంఒ డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, పలువురు వైద్యాధికారులు, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. డివిజనల్ స్థాయి, మండల స్థాయి అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో బాలేపల్లి మాజీ సర్పంచి చిక్కాల రాజు రాజకుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)



పిఠాపురంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

విద్యుత్తు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపరాదని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం అగ్రహారంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం వారు ధర్నా నిర్వహించారు. సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ కె చిన్న మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ టిడిపి కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీని మరచి గతంలో వినియోగించిన విద్యుత్తుకు సర్దుబాటు చార్జీల పేరుతో రూ.6,072 కోట్ల భారాన్ని మోపనుందన్నారు. ఈ ఏడాది నవంబరు నుంచి 2026 జనవరి వరకూ ఈ భారం ప్రజలపై పడుతుందన్నారు. ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై ఇలా భారాల మోపడం సరికాదన్నారు. ఒకవైపు ఉపాధి లేక, మరో వైపు అధిక ధరలతో ప్రజలు సతమతమ వుతున్నారని పేర్కొన్నారు. ఈ సమయంలో విద్యుత్ భారాలు మోపడం దారుణమన్నారు. భారాలు తగ్గాలంటే ఎమ్మెల్యేలు, ఎంపిలు జీతభత్యాలు తగ్గించుకోవాలన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తాను జీతం తీసుకోబోనని చెప్పారని, మిగిలిన ఎమ్మెల్యేలు కూడా వారి జీతభత్యాలు తగ్గిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టాల న్నారు. విద్యుత్ సర్దు బాటు చార్జీల భారాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్‌కి వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కోనేటి రాజు, నాగేశ్వరరావు, మణి, స్టాలిన్, మణికంఠ, వీరబాబు, విశ్వనాథం, రాజేష్, నాగు పాల్గొన్నారు.

అసమానతల్లేని అభివృద్ధి కోసం పోరాటం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు
- ముగిసిన సిపిఎం అన్నమయ్య జిల్లా మహాసభ

ప్రజాశక్తి-రాయచోటి (అన్నమయ్య జిల్లా)



మహాసభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అసమానతలు లేని జిల్లా అభివృద్ధి కోసం సిపిఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ప్రారంభమైన అన్నమయ్య జిల్లా సిపిఎం ప్రథమ మహాసభ సోమవారం ముగిసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నవంబర్ ఒకటి నుంచి ఏడు వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాహోరు నిర్వహించాలని మహాసభ తీర్మానించింది. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ ఒకటి నుండి ఏడు వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాహోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని, ఎనిమిదిన జిల్లా కలెక్టరేట్లు, మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని కోరారు. మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రయివేటుపరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసం కేంద్రం తెచ్చిన చట్ట సవరణలను టిడిపి బలపర్చడం శోచనీయమన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు తక్షణం కార్మిక సంఘాలతో చర్చించి కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మహాసభల్లో తీర్మానాలు..

అన్నమయ్య జిల్లా సిపిఎం ప్రథమ మహాసభలో ప్రజా సమస్యలపై 30 రకాల తీర్మానాలను ఆమోదించారు. వాటిలో ముఖ్యమైనవి.. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, జిల్లా అభివృద్ధికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రూ.పది వేల కోట్లు కేటాయించి మూడేళ్లలో ఖర్చుచేయాలని, జిల్లాలోని అన్నమయ్య, ఫించా, ముదివేడు ప్రాజెక్టుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని తీర్మానించారు. అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం, పునర్నిర్మాణం ప్యాకేజీ, రాయచోటి ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా, మదనపల్లె ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా, రాజంపేటలో వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాటు, మదనపల్లెలో చేనేత క్లస్టర్ల ఏర్పాటు చేయాలి. కడప-మదనపల్లె-బెంగళూరు రైల్వేలైన్ పనులకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని తీర్మానాలను ఆమోదించింది.

అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు



సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా పి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పి.రాజమ్మ, ఎ.రామాంజులు, సి.హెచ్.చంద్రశేఖర్, సి.రవికుమార్, డి.వెంకటయ్య, పందికాళ్ళ మణి ఎన్నుకోబడ్డారు.

బిఎస్ రెడ్డికి డాక్టర్ ఆఫ్ మ్యాజిక్ అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



అవార్డు అందుకుంటున్న రెడ్డి

ప్రఖ్యాతిగాంచిన భారతీయ ఇంద్రజాలికుడు బిఎస్ రెడ్డి ఖాతాలోకి మరో అరుదైన గౌరవం వచ్చి చేరింది. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఐదు రోజులపాటు 'థాయిలాండ్ ఇంటర్నేషనల్ మ్యాజిక్ ఎక్స్‌ట్రావగంజా-2024' పేరిట బ్యాంకాక్‌లో ప్రపంచ స్థాయి మ్యాజిక్ కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ఇంటర్నేషనల్ మెజీషియన్స్ సొసైటీ - మ్యాజిక్ అకాడమీ నిర్దేశించిన కోర్సును విజయవంతంగా పూర్తి చేసినందుకుగాను డాక్టర్ ఆఫ్ మ్యాజిక్ డిప్లమా యోగ్యతా పత్రాన్ని, బంగారు పతకాన్ని సొసైటీ చైర్మన్ టోనీ హస్సినీ సభికుల హర్షధ్వానాల మధ్య అందజేశారు. భారతదేశం తరపున ఐదు రోజుల పాటు జ్యూరీ జడ్జిగా కన్వెన్షన్‌లో వ్యవహరించిన తొలి భారతీయ ఇంద్రజాలికునిగా ఆయన నిలిచారు. జపాన్, అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, ఇండియా, ఇరాన్, కువైట్, కొరియా, థాయిలాండ్, ఫిలిప్పైన్స్, హాంకాంగ్, వియత్నాం, సింగపూర్, థైవాన్, మొరాకో తదితర దేశాలకు చెందిన 150 మంది మెజీషియన్లు, ప్రతినిధులు ఈ కన్వెన్షన్‌లో పాల్గొన్నారు.

స్విగ్గీ ఐపిఒ ధరల శ్రేణి రూ.371-రూ.390

ముంబయి : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ధరల శ్రేణీని రూ.371-390గా నిర్ణయిం చింది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం నవంబర్ 5న ఇష్యూ తెరువనుంది. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం 6-8 వరకు కొనసాగనున్న ఈ ఇష్యూలో రూ.11,300 కోట్ల నిధుల సమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ప్రోసస్‌కు స్విగ్గీలో 31శాతం వాటా ఉంది. ఎంఐహెచ్ ఇండియా ఫుడ్ హోల్డింగ్స్ రూపంలో వాటాలు ఉన్నాయి. ఇందులో ఐదో వంతు వాటాను ఐపిఒలో భాగంగా విక్రయించే అవకాశాలున్నాయి.

నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం

- ఎమ్మెల్యే ఎదుట వంకావారిగూడెం వాసులు ముక్తకంఠంతో నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి (ఏలూరు జిల్లా)



నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా గ్రామసభలో నినదిస్తున్న వంకావారిగూడెం ప్రజలు

నేవీ ఆయుధ సామగ్రి డిపోను తమ ప్రాంతంలో పెట్టేందుకు వీల్లేదని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని ప్రజలు ముక్తకంఠంతో గ్రామసభలో తీర్మానం చేశారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు సంబంధించి ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ సందీప్ అధ్వర్యంలో సర్పంచి కుంజా పార్వతి అధ్యక్షతన సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ఈ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు గ్రామసభల్లో వ్యతిరేకించి తీర్మానాలు చేయడంతోపాటు జిల్లా కలెక్టర్‌కు 'స్పందన' కార్యక్రమంలోనూ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా వినతులు ఇచ్చామని గుర్తు చేశారు. గ్రామసభ ఆమోదం లేకుండా ఎటువంటి కార్యక్రమం జరగదని అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారని తెలిపారు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామసభ అంటూ రావడం తమను భయభ్రాంతులకు గురి చేస్తోందని గిరిజనులు వాపోయారు. నేవీ ఆయుధ డిపో నిర్మిస్తే ఏజెన్సీకి మనుగడ లేకుండా పోతుదందన్నారు. పోలవరం ప్రాజెక్ట్, జల్లేరు, పోగొండ జలశయాలకు గిరిజనులు భూములు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వాలు, అధికారులు మాటలు చెప్పారని, తీరా భూములు ఇచ్చాక గిరిజనులను నట్టేట ముంచారని వాపోయారు. మళ్లీ ఇప్పుడు నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు భూసేకరణ అంటూ ఏజెన్సీ నుంచి తమను తరిమి కొట్టడానికి సిద్ధమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు లేకుండా పోతారన్నారు. దీనిపై ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని తెలిపారు. మీ సందేహాలను రాత పూర్వకంగా ఇస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వానికి తెలిసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావు, మడకం శేషగిరి, కుంజా రాముడు, పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



గూగుల్‌కు రూ.26 వేల కోట్ల జరిమానా

- చిన్న సంస్థను తొక్కేసిన కేసులో..

లండన్ : ఒక్క చిన్న సంస్థను తన టెక్నాలజీతో తొక్కేసిన కేసులో దిగ్గజ సెర్చింజన్ గూగుల్‌కు భారీ జరిమానా పడింది. 2006లో బ్రిటన్ చెందిన శివన్, ఆడమ్ రాఫ్ అనే దంపతులు ధరలను పోల్చుకోవడానికి వీలుగా 'ఫౌండమ్' అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కాగా.. సెర్చింజన్‌లో కీ వర్డ్ ఉపయోగించి వెతికినప్పటికీ ఫౌండమ్ కనిపించకుండా గూగుల్ కుట్ర చేసిందనేది ప్రధాన అభియోగం. ఈ విషయాన్ని వ్యవస్థాపకులు గూగుల్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. పట్టించుకోలేదు. దీంతో వారు యూరోపియన్ కమిషన్‌కు 2010లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తులో గూగుల్ నిర్లక్ష్యం, అన్యాయం చేసినట్లు తేలింది. దీంతో గూగుల్‌పై 2.4 బిలియన్ పౌండ్స్ (దాదాపు రూ.26వేల కోట్లు) జరిమానా విధిస్తూ 2017లో తీర్పునిచ్చింది. దీనిపై గూగుల్ మళ్లీ అప్పీల్‌కు వెళ్లడంతో ఇటీవల యూరోపియన్ కోర్టు ఆఫ్ జస్టిస్ శివన్, ఆడమ్ రాఫ్‌లకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

ఆఫీసు లీజింగ్ 30 శాతం వృద్ధి : సవిల్స్ ఇండియా

న్యూఢిల్లీ : భారత్‌లో 2024లో కార్యాలయాల అద్దె డిమాండ్ ఏడు కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణానికి చేరొచ్చని గ్లోబల్ రియల్ ఎస్టేట్ అడ్వైజరీ సంస్థ సవిల్స్ ఇండియా అంచనా వేసింది. ఆరు ప్రధాన నగరాల్లో ఈ ఏడాదిలో జనవరి నుంచి సెప్టెంబర్ కాలంలో 5.5 కోట్ల చ.అ స్థాయికి చేరిందని తెలిపింది. గతేడాది ఇదే సమయంతో పోల్చితే 30 శాతం పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది.

ఒఎన్‌జిసి డ్రైవర్ల వేతన సమస్యను పరిష్కరించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



ఒఎన్‌జిసి బేస్‌కాంప్లెక్స్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లు

రాజమహేంద్రవరం ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లు తమ వేతన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. బొమ్మూరులోని ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్ మెయిన్ గేటు ఎదుట ఒఎన్‌జిసి కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి అరుణ్ మాట్లాడుతూ ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్‌లో 350 మందికి పైగా కారు డ్రైవర్లు కాంట్రాక్టు వర్కర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. యాజమాన్యంతో ఒప్పందం సమయంలో నిబంధనలకు కాంట్రాక్టర్లు తూట్లు పొడుస్తున్నారన్నారు. సెంట్రల్ లేబర్ డిపార్ట్‌మెంట్ నిర్దేశించిన కనీస వేతనంతో పాటు అదనంగా 35 శాతం ఫెయిర్ వేజ్ ఇవ్వాలని, దీనికి అంగీకరించిన వారే టెండర్లు వేసేందుకు అనుమతి ఉందని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం వరకూ నెలకు రూ.22 వేల నుచి రూ.25 వేల వేతనం తీసుకునే వారని తెలిపారు. కొత్త కాంట్రాక్టరు రెండేళ్లుగా నెలకు రూ.14 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఫెయిర్ వేజ్‌ను దోపిడీ చేసి కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. పలుమార్లు డ్రైవర్లు మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గుర్తింపు సంఘాన్ని కూడా పట్టించుకోవడంలేదని తెలిపారు. తక్షణమే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతో పాటూ డ్రైవర్లకు కనీసం వేతనంతో పాటు ఫెయిర్ వేజ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముచ్చకర్ల సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి డి సోమశంకర్, ఎవివి సత్యనారాయణ ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ మూర్తి, జిల్లా కోశాధికారి కెఎస్‌వి రామచంద్రరావు, జిల్లా కార్యదర్శి బి పూర్ణిమరాజు, జిల్లా కమిటీ సభ్యులు బి పవన్, ఒఎన్‌జిసి కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు అప్పారావు, త్రినాథ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం ఇంటి హంగులకు రూ.1.44 కోట్లు మంజూరు

- జిఒ ఆర్‌టి నెంబరు 321 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసం మరమ్మతులు, ఇంటి హంగులు, వివిఐపి సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.1.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం రోడ్లు భవనాల శాఖ జిఒ ఆర్‌టి నెంబరు 321ని విడుదల చేసింది. ఇందులో సోలార్ ఫెన్సింగ్ కోసం రూ.21 లక్షలు, నివాసం లోపల, బయట నిఘా కోసం రూ.81 లక్షలతో సిసి కెమెరాలు, సిఎం ఇంటికి వచ్చే వాహనాల తనిఖీలు, నియంత్రణ, యువిఎస్ఎస్, హైడ్రాలిక్ బోలార్డ్స్ కోసం రూ.42 లక్షలు ఆర్‌అండ్‌బి శాఖ ఖర్చు పెట్టనుంది.

సంపాదకీయం

బిల్లు భారం

ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారుల నుంచి రూ.6,072 కోట్ల అదనపు ఎలక్ట్రిసిటీ బిల్లుల వసూళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఒడిగట్టడం దుర్మార్గం. నిత్యావసర వస్తువులు సహా అన్నింటి ధరలూ ఆకాశాన్నంటుతున్న వేళ, ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు దిగజారుతున్న సమయాన సర్కారు మోదిన విద్యుత్ భారం ప్రజలకు శరాఘాతం. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) మాటున మూడేళ్ల కింద 2022-23లో వాడుకున్న కరెంట్‌కు ఇప్పుడు వినియోగదారుల నుంచి బిల్లులు బాదేందుకు అనుమతించాలని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కం) ఎ.పి. విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)ని కోరగా వెను వెంటనే బహిరంగ విచారణ తతంగం ముగించిన మండలి, ట్రూఆప్ చార్జీల వసూళ్లకు అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చేసింది. ప్రజలపై చార్జీలు మోదొద్దని పలు సంస్థలు, పార్టీలు, ప్రజలు విన్నవించినా కనికరించలేదు. పైగా డిస్కంలు రూ.8,114 కోట్ల వసూళ్లకు అనుమతి కోరగా రూ.2 వేల కోట్లు తగ్గించామని, అది ప్రజలకు తామిచ్చిన పెద్ద ఊరట అని సమర్ధించుకోవడం పెద్ద దగా. ఈ డిసెంబర్ మొదలుకొని 15 మాసాలపాటు బిల్లులు గుంజుతారు. నెలకు యూనిట్‌కు గరిష్టంగా రూ.1.58 వంతున అదనంగా జనం గోళ్లూడగొట్టి వసూలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.

తమకు అధికారమిస్తే కరెంట్ బిల్లులు నియంత్రిస్తామని, సోలార్ పథకం ద్వారా బిల్లుల భారం తగ్గిస్తామని టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు హామీ ఇచ్చింది. చంద్రబాబు మారారని ఆశ పడ్డ వారి ఆశలు ఆవిరి కావడానికి నాలుగు మాసాలు పట్టలేదు. తామైతే 35 శాతం బిల్లులు తగ్గించేవారమని ప్రతిపక్షంలో ఉండగా బాబు చాలా తడవలు వల్లెవేశారు. తగ్గించడమేమో, 44 శాతం పెంచడం అమానుషం. చార్జీల పెంపుపై ఇఆర్‌సి ఆర్డర్‌ను చూసి కొత్తగా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే పవర్ సెక్టార్‌పై విడుదల చేసిన వైట్ పేపర్‌లో చార్జీల పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగానే శెలవిచ్చారు. జనమే గ్రహించలేకపోయారు. 2022-23, 2023-24 ఇంధన సర్దుబాటు చార్జీల బకాయిలు రూ.17,137 కోట్ల వరకు ఉన్నాయన్నారు సిఎం. వాటిలో 6,072 కోట్ల వసూళ్లకు లైన్‌క్లియర్ చేశారు. ఇంకా 11,826 కోట్ల బకాయిలున్నాయి. ఈ పూర్వరంగంలోనే వాటినీ వసూలు చేస్తామని విద్యుత్ శాఖా మంత్రి తాజాగా కుండబద్దలు కొట్టారు. ట్రూఅప్ చార్జీల వసూళ్లకు కూటమి సర్కారు చెప్పే సాకు గత ప్రభుత్వ నిర్వాకం. అది నిజమే. కానీ ఈ ప్రభుత్వానికి ప్రజలపై భారం వేయొద్దన్న ఆలోచన ఉన్నట్లయితే ట్రూఅప్ భారం తాను భరించి జనానికి ఉపశమనం కలిగించొచ్చు. గతంలో ట్రూఅప్ వసూళ్ల పిటిషన్లను ఇఆర్‌సి చెంతకు చేరకుండా చేసిన అనుభవం టిడిపికి ఉండింది కూడా.

పవర్ సెక్టార్‌లో ఒకటవ, రెండవ దశల 'సంస్కరణ'లను తానే అమలు చేశానని, చేయబోయేది 3.0 రిఫార్మ్స్ అని శ్వేతపత్రంలో సిఎం ప్రకటించారు. ఇక్కడ సంస్కరణలు అంటే ప్రజలకు మంచి చేసేవి కావు. ప్రపంచబ్యాంక్ ఆదేశాలు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి ప్రైవేటు, కార్పొరేట్లకు అడ్డంగా దోచిపెట్టేవి. ఎలక్ట్రిసిటీ బోర్డు విభజన, జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలు, ఇఆర్‌సి, పిపిఎలు, షార్ట్‌టర్మ్ కొనుగోళ్లు అందులో భాగమే. ఏనాడో కాల్చిన కరెంట్‌కు కొన్నేళ్ల తర్వాత బిల్లులు కట్టాలన్న ఎఫ్‌పిపిసిఎ విధానమూ అంతే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం ప్రతిపాదిస్తే టిడిపి, జనసేన, వైసిపి పోటీ పడి మరీ జైకొట్టాయి. సదరు పార్టీల ఏలుబడిలో కరెంట్ బిల్లులు తగ్గుతాయనుకోవడం అత్యాశ, అవివేకం. బిజెపి సంస్కరణలు కార్పొరేట్ల యథేచ్ఛ దోపిడీకి దారులు వేస్తాయి. ప్రజలపై పెనుభారాలు మోపుతాయి. ఇప్పటికే గ్రీన్, విండ్, థర్మల్, సోలార్, పంప్డ్ స్టోరేజి పేరిట విద్యుత్ రంగాన్ని అదానీకి ఏ విధంగా కట్టబెడుతున్నారో చూస్తున్నాం. బిజెపి విధానాల అమలు విషయంలో వైసిపి, టిడిపి కూటమి ఒకటే. ట్రూఅప్ చార్జీల వసూలు నిర్ణయాన్ని కూటమి సర్కారు ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వ మెడలు వంచేందుకు ప్రజలు నాటి బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తిని కనబరచాలి.


మహనీయుల మాట



సమాజంలో మార్పు రావాలంటే కుల వ్యవస్థ పోవాలి. స్త్రీల స్థాయి పెరగాలి. పురాణాలకు అనుగుణంగా ఆధునిక వ్యవస్థ ఉండాలనుకోవడం తప్పు. చిన్న పిల్లల పెళ్లిళ్లు జరగకూడదు. స్త్రీలు పురుషులకు బానిసలు అన్న భావం తొలగిపోవాలి.

- గోపాల్ గణేష్ అగార్కర్, సంఘ సంస్కర్త.

పేదరికం - సంపద - గతితర్కం



ప్రభాత్ పట్నాయక్


"దేశాల సంపద పెరుగుదలకు దోహదం చేసే అంశాలు ఏవి? ఆటంకపరిచే అంశాలు ఏవి?" అన్న విషయం మీద చేసిన పరిశోధనలకు గాను ముగ్గురు అమెరికన్ ఆర్థికవేత్తలకు ఈ ఏడాది నోబెల్ బహుమతి (సరిగ్గా చెప్పాలంటే అది రిక్స్ బ్యాంక్ బహుమతి) దక్కింది. సంపద పెరుగుదలలో ఆ యా దేశాలలో ఉనికిలో ఉండే వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని వారి పరిశోధనలో నిర్ధారించారు. ఎన్నికల ప్రజా స్వామ్యం వంటి పశ్చిమ దేశాల వ్యవస్థలు సంపద పెరుగుదలకు దోహదం చేస్తాయని వారు తెలిపారు. వలసవాదం ఎక్కడెక్కడ "వలస వచ్చిన వారితో స్థిర నివాసాలు" ఏర్పరచిందో అక్కడల్లా సంపద బాగా వృద్ధి చెందిందని వారు నిర్ధారించారు. అటువంటి స్థిర నివాసాలు ఏర్పరచకుండా, వలసల నుండి "పిండుకునే వ్యవస్థలను" మాత్రమే ఏర్పరచిందో అటువంటి చోట్ల అవి సంపద వృద్ధికి హానికరంగా పరిణమించాయని భావించారు.

ఈ ఆర్థికవేత్తల పరిశోధన, నిర్ధారణలు అనేక విమర్శలకు దారి తీశాయి. పశ్చిమ దేశాల మాదిరి ప్రజాస్వామ్య వ్యవస్థలు లేకుండానే తూర్పు ఆసియా దేశాలు ఆర్థికాభివృద్ధిలో విజయాలు సాధించాయని, దానితోబాటు ఆ దేశాలు అవినీతి రహితంగా వృద్ధి చెందాయని, అదే పశ్చిమ దేశాలు వేగంగా వృద్ధి చెందిన కాలంలో వృద్ధి తోబాటు తీవ్ర స్థాయిలో అవినీతి కూడా చోటు చేసుకుందని విమర్శకులు అన్నారు. తమ వెంట తమ బంధుమిత్రులను, అనుచరులను తెచ్చుకుని కొత్త ప్రదేశాలలో స్థిరనివాసాలు ఏర్పరచుకోవడం జరిగిందే తప్ప తక్కిన వారిని అనుమతించలేదని మరికొందరు అన్నారు. పశ్చిమ దేశాల వ్యవస్థలను పవిత్రమైనవిగా చిత్రించే ప్రయత్నం చేశారే తప్ప వలసవాదం సాగించిన అణచివేతను వారి పరిశోధన విస్మరించిందని మరి కొందరు అన్నారు.

ఇక్కడ మనం ఆ పరిశోధకుల వాదనల లోతుల్లోకి గాని, వారిని విమర్శించే వారు సహేతుకంగా విమర్శించినా, లేకున్నా, ఆ విమర్శల లోతుల్లోకి గాని పోవడం లేదు. అటు పరిశోధకులు, ఇటు విమర్శకులు ఇరు పక్షాలూ వృద్ధి, వెనుకబాటుతనం గురించి వ్యక్తం చేసిన అవగాహనలోనే మౌలికమైన లోపం ఉందన్న సంగతిని నొక్కి చెప్పదలుచుకున్నాను. పేదరికం అంటే ఆర్థిక వృద్ధి లేకపోవడమే అని వారు భావిస్తున్నారు. వృద్ధితోబాటు పేదరికం కూడా పెరుగుతుందన్న గతితార్కిక అవగాహన వారికి లోపించింది. ఒక దేశాన్ని మొత్తంగా ఒక జాతిగా పరిగణిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలున్న దేశాలు ఆర్థికవృద్ధి చెందాయని, కొల్లగొట్టే వ్యవస్థలు ఏర్పడిన దేశాల్లో ఆర్థిక వెనుకబాటుతనం ఉన్నదని వారు నిర్ధారించారు. కొన్ని దేశాలు ముందుకు పోయినందువల్లే మరికొన్ని దేశాలు వెనుకబడిపోయాయన్నది అంతర్లీనంగా వారి వాదన సారాంశం. వారు విస్మరించిన అంశం ఏమంటే, అసలు పెట్టుబడిదారీ ఆర్థికవృద్ధి అంటేనే దానితోబాటు పేదరికం కూడా పెరుగుతుందన్న మౌలిక వాస్తవం. దీనినే ఏండ్రి గుండెర్ ఫ్రాంక్ "వెనుకబాటుతనపు అభివృద్ధి" అన్న పదంతో వర్ణించారు. వెనుకబాటుతనం అంటే వృద్ధి లేకపోవడం కాదని, సంపద వృద్ధి చెందే క్రమంలోనే వెనుకబాటుతనం కూడా వృద్ధి చెందుతుందని దానర్థం. సంపద పెరుగుదలతోబాటు పేదరికం కూడా పెరుగుతుందనే మౌలికాంశాన్ని రిక్స్ బ్యాంక్ బహుమతి గ్రహీతలు పూర్తిగా విస్మరించారు.

సంపద పెరగడంతోబాటు పేదరికం ఎందుకు పెరుగుతుంది? కొన్ని దేశాలు ఆర్థిక వృద్ధి సాధించగా మరికొన్ని దేశాలు ఎందుకు వెనుకబడిపోతాయి? పెట్టుబడిదారీ ఆర్థికాభివృద్ధి అనివార్యంగా కొల్లగొట్టి పోగేసుకున్న పెట్టుబడితో ముందుకు సాగుతుంది. అలా కొల్లగొట్టబడ్డ చిన్న చిన్న ఉత్పత్తిదారులంతా పేదరికంలోకి దిగజారిపోతారు. పెట్టుబడిదారీ వ్యవస్థ వారిలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే తన పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలోకి కార్మికులుగా, ఉద్యోగులుగా ఇముడ్చుకుంటుంది. ఒకపక్క కొల్లగొట్టే ప్రక్రియ కొనసాగుతూనే వుంటుంది. మరోపక్క పెట్టుబడిదారీ వ్యవస్థలో స్థానం పొందలేని వారంతా పేదరికంలోకి దిగజారిపోతూనే వుంటారు. ఒకవేళ పేదరికంలోకి జారిపోయిన వారి సంఖ్య పెరగకపోయినా, వారి పేదరికం మాత్రం పెరుగుతూనే వుంటుంది. కొల్లగొట్టి పోగేసుకోవడం అనే పెట్టుబడిదారీ క్రమం నిరంతరాయంగా కొనసాగే ప్రక్రియ. అందుచేత పేదలూ పెరుగుతూంటారు. వారి పేదరికమూ పెరుగుతూపోతుంది.

అందువల్లనే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకవైపు సంపద పోగుబడుతూ వుంటే మరోపక్క పేదరికం కూడా పెరుగుతూనే వుంటుంది. ఈ పెట్టుబడిదారీ విధానంలో సంపద పోగుబడే తీరును మొత్తంగా చూడకుండా, విడివిడిగా చూడడం వల్ల సమగ్రమైన అవగాహన ఏర్పడకుండా పోతుంది.



వెనుకబాటుతనం అంటే వృద్ధి లేకపోవడం కాదని, సంపద వృద్ధి చెందే క్రమంలోనే వెనుకబాటుతనం కూడా వృద్ధి చెందుతుందని దానర్థం. సంపద పెరుగుదలతోబాటు పేదరికం కూడా పెరుగుతుందనే మౌలికాంశాన్ని రిక్స్ బ్యాంక్ బహుమతి గ్రహీతలు పూర్తిగా విస్మరించారు.

1850 దశకం నుండి 1914 (మొదటి ప్రపంచ యుద్ధం) వరకూ పెట్టుబడిదారీ వ్యవస్థ సుదీర్ఘకాలం పాటు వేగంగా వృద్ధి సాధించింది. ఈ కాలంలో పెట్టుబడిదారీ విధానం ఒక ప్రపంచవ్యాప్త వ్యవస్థగా బలపడింది. బ్రిటన్ నుండి యూరప్ ఖండానికి మొత్తంగా విస్తరించింది. యూరప్ నుండి శీతల ప్రదేశాలైన కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి చోట్లకు వలసలు పోయారు. (ఈ దేశాలనే "కొత్త ప్రపంచం" అని అంటారు) అక్కడికి కూడా పెట్టుబడిదారీ విధానం విస్తరించింది. ఇలా వలసలు పోయి స్థిరపడిన దేశాలకు యూరప్ నుండి పరిశ్రమలు కూడా తరలివెళ్ళాయి. బ్రిటన్ ఈ కొత్త ప్రాంతాల నుండి దిగుమతులకు తన దేశంలో అవకాశాలు కల్పించింది. దానితోబాటు తన దేశం నుండి ఈ దేశాలకు పెట్టుబడిని ఎగుమతి చేసింది. ఇలా ఇతర దేశాలకు వలస పోయి ఆక్రమించుకుని పెట్టుబడిదారీ వ్యవస్థను విస్తరించడాన్ని "సెటిలర్ కొలోనియలిజం" అని అంటాం. పెట్టుబడిదారులతో బాటు యూరప్ నుండి కొత్త ప్రదేశాలకు యూరప్ ఖండపు ప్రజానీకం పెద్ద సంఖ్యలో తరలిపోయారు.

1810 దశకం నుండి (నెపోలియన్ యుద్ధాల కాలం 1803-1815) మొదటి ప్రపంచ యుద్ధకాలం వరకూ మధ్యలో కనీసం 5 కోట్లమంది యూరప్ ఖండం నుండి వలసలు పోయారని అంచనా. ఇలా వలసలు పోయినవారు తాము ప్రవేశించిన చోట స్థానికుల నుండి భూములను లాక్కున్నారు. చావగా మిగిలిన స్థానికులను కొద్దిపాటి భూభాగాలలోకి నెట్టి అక్కడికే వారిని పరిమితం చేశారు. అత్యధికంగా వలసలు బ్రిటన్ నుండే జరిగాయి. ఆ కాలంలో బ్రిటన్‌లో ఎంత జనాభా పెరిగిందో, అందులో సగం పైగా సంఖ్యలో వలసలు పోయారు.

ఇలా కొత్తగా ఆక్రమించుకుని స్థిరపడిన దేశాలనుండి ముడిసరుకులను, పారిశ్రామిక ఉత్పత్తులను తన దేశంలోకి దిగుమతి చేసుకునే అవకాశాన్ని బ్రిటన్ కల్పించింది. దానితోబాటు తన దేశం నుండి ఆ "కొత్త ప్రపంచానికి" పెట్టుబడులను ఎగుమతి చేసింది. ఆ క్రమంలో చాలా పెద్ద స్థాయిలో "చెల్లింపుల లోటు"ను కొనసాగించింది. ఇలా పెద్ద స్థాయిలో ఆ "కొత్త ప్రపంచం" నుండి సరుకులను దిగుమతి చేసుకోవడం వలన నిజానికి బ్రిటన్‌లో ఉన్న పరిశ్రమల సరుకులు మిగిలిపోయి, బ్రిటిష్ పరిశ్రమలు మూతబడే ప్రమాదం ఏర్పడి వుండాలి. కాని అలా జరగలేదు. దానికి కారణం తమ వద్ద ఉన్న అధికోత్పత్తినంతటినీ బ్రిటన్ ఉష్ణమండల దేశాలకు (భారతదేశం వగైరా) ఎగుమతి చేసింది. దాని ఫలితంగా ఈ ఉష్ణమండల దేశాలలో అంతవరకూ నడిచిన పరిశ్రమలు కాస్తా మూతబడ్డాయి. ముఖ్యంగా సాంప్రదాయ చేతివృత్తులన్నీ దెబ్బ తిన్నాయి. వారి ఆదాయాలు బాగా పడిపోయి తీవ్ర పేదరికంలోకి వారంతా నెట్టబడ్డారు. ఇలా చితికిపోయిన వృత్తుల్లో నేత వృత్తి ప్రధానమైంది.

"కొత్త ప్రపంచపు" దేశాల నుండి బ్రిటన్ దిగుమతి చేసుకున్న సరుకులకు చెల్లించవలసిన మొత్తం లోటుగా పెరిగిపోయింది. ఆ లోటును భర్తీ చేయడానికి ఉష్ణ దేశాలకు అమ్మిన సరుకుల ద్వారా వచ్చిన సంపదను వాడుకున్నారు. ఉష్ణదేశాల నుండి బ్రిటన్ కొనుగోలు చేసిన ముడి సరుకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించకుండా తమ వద్దే అట్టిపెట్టుకుని దానితో తమ వ్యాపార చెల్లింపుల లోటును భర్తీ చేసుకున్నారు.

అప్పట్లో భారతదేశం నుండి యూరప్‌కు, "కొత్త ప్రపంచ దేశాలకు", జపాన్‌కు భారీగా సాగుతూ వచ్చిన ఎగుమతుల కారణంగా వ్యాపార చెల్లింపులలో మిగులు చాలా ఎక్కువగా ఉండేది. ప్రపంచంలోని దేశాలలో ఇలా వ్యాపార చెల్లింపులలో మిగులును అత్యధికంగా కలిగి వుండిన దేశాల్లో భారతదేశం రెండో స్థానంలో ఉండేది. ఇంత భారీ మిగులును కాస్తా బ్రిటన్ అప్పనంగా కాజేసి తన వ్యాపార లోటును భర్తీ చేయడానికి వాడుకుంది. అప్పనంగా కాజేయడం ఎలా సాధ్యపడింది? బ్రిటన్ ప్రభుత్వం భారతీయ రైతుల నుండి భారీగా పన్నులు వసూలు చేసింది. అలా వచ్చిన సొమ్ముతోటే ఆ రైతుల నుండి ముడిసరుకులను కొనుగోలు చేసింది. అంటే అప్పనంగా కాజేసినట్టే కదా ?

ఆ విధంగా మొదటి ప్రపంచ యుద్ధ కాలం దాకా దీర్ఘకాలం పాటు యూరప్ లోను, "కొత్త ప్రపంచం" లోను సాగిన పెట్టుబడిదారీ వృద్ధికి ప్రతిగా భారతదేశం తదితర ఉష్ణ మండల దేశాలలో పేదరికం పెరిగింది. తరచూ కరువులు సంభవించేవి.

కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి "కొత్త ప్రపంచపు" దేశాలు వలస సామ్రాజ్యవాదానికి ఉదాహరణలైతే, భారతదేశం, తక్కిన ఆసియా, ఆఫ్రికా దేశాలు స్వాధీనపరుచుకున్న వలసలకు ఉదాహరణలు.

భారతదేశం మొదటి నుంచీ పేద దేశం అని భావించడం తప్పు. మొఘల్ పాలకుల కాలంలో తలసరి ఆదాయం (1575 నాటి అబుల్ ఫైజల్ లెక్కల ఆధారంగా)తో పోల్చితే 1910 నాటికి ఐదో వంతుకు పడిపోయింది. బ్రిటిష్ పాలకులు అంత భారీగా కొల్లగొట్టారన్నమాట.

1850 నుండి సాగిన పారిశ్రామిక పెట్టుబడి విస్తరణ ఉష్ణ దేశాలలోని మిగులు సంపదను పీల్చి పిప్పి చేయడం ద్వారా సంభవించింది. ఆ దేశాల మార్కెట్లనూ బ్రిటన్ తన సరుకులతో ఆక్రమించింది. కొల్లగొట్టి పోగేసుకునే పెట్టుబడి క్రమం ఇది. దీని ఫలితంగా ఉష్ణ మండల దేశాల్లో పేదరికం పెరిగింది. ఇలా కొల్లగొట్టినన సంపద లబ్ధిదారులు మాత్రం యూరప్, "కొత్త ప్రపంచపు" దేశాలు. అక్కడ సంపద భారీగా పెరిగింది.

ఆ విధంగా ఒకవైపు సంపద పెరగడం, మరోవైపు పేదరికం పెరగడం అనే క్రమం గతితార్కిక సంబంధం కలిగి వుంది. ఇది పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలోనే అంతర్లీనంగా ఉంది. కాని పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు ఎవరూ ఈ నిజాన్ని ఒప్పుకోడానికి సిద్ధపడరు.

(స్వేచ్ఛానుసరణ)

> 1850 నుండి సాగిన పారిశ్రామిక పెట్టుబడి విస్తరణ ఉష్ణ దేశాలలోని మిగులు సంపదను పీల్చి పిప్పి చేయడం ద్వారా సంభవించింది. ఆ దేశాల మార్కెట్లనూ బ్రిటన్ తన సరుకులతో ఆక్రమించింది. కొల్లగొట్టి పోగేసుకునే పెట్టుబడి క్రమం ఇది. దీని ఫలితంగా ఉష్ణ మండల దేశాల్లో పేదరికం పెరిగింది. ఇలా కొల్లగొట్టినన సంపద లబ్ధిదారులు మాత్రం యూరప్, "కొత్త ప్రపంచపు" దేశాలు. అక్కడ సంపద భారీగా పెరిగింది.

> ఆ విధంగా ఒకవైపు సంపద పెరగడం, మరోవైపు పేదరికం పెరగడం అనే క్రమం గతితార్కిక సంబంధం కలిగి వుంది. ఇది పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలోనే అంతర్లీనంగా ఉంది. కాని పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు ఈ నిజాన్ని ఒప్పుకోడానికి సిద్ధపడరు.

కవిత్వం

స్వేచ్ఛా పిపాసి

నాలుగ్గోడలే ప్రజాస్వామ్యాన్ని బంధించాయా..!!
ఎవరు? ఎవరి వెనకాల ఎవరు?
వాళ్ళ వెనకాల ఇంకెవరు? మరెవరెవరూ..?
ఈ అమానవీయ చర్యను
రచించి ప్రదర్శించిందెవరు?
ముసుగుల మంతనాల ఆ
అదృశ్య నిస్సిగ్గు శక్తులెవరు?
తలుచుకుంటేనే ఆ నరకాన్ని
ఒంట్లోంచి ఎముకలు కత్తులై
తన్నుకొస్తున్నాయి...
న్యాయదేవత కుత్తుకను సైతం
నొక్కి పడుతుంటే.. ఓ సాక్షి దేశమా..!
సమానత్వం స్వేచ్ఛగా ఊపిర్లు
తీసుకోవడమే అతడు
కాంక్షించింది కదా!
అఖండమైన ఆ ఆశయాన్ని
బందిఖానాలో ప్రతిక్షణం చెదలై
మెల్లమెల్లగ కొరుక్కుతిన్నదెవరు?
కదలడానికే వీలులేని చక్రాల కుర్చీని
కనికరం లేకుండా మగ్గగొట్టి... భలే
మట్టుబెట్టామనుకుంటున్న ఆ నీచ
నిరంకుశులకు తెలియదీ నిజం...
ఆ కుర్చీకీ- మండుతున్న లావా గోళాలు
చిగురించాయని వాటి వేర్లు
చరిత్ర గర్భంలో ఫాసిస్టులను
నియంతలను నిర్బంధ శక్తులనూ
తొక్కుతూ ఉరేస్తూ మెలేస్తూ
మట్టి కరిపిస్తూ వచ్చాయనీ..!!
ఓ బ్రదర్స్ అండ్ సిస్టర్స్...
డియర్ ఫ్రెండ్స్ అండ్ రైటర్స్...
చిన్నా పెద్దా అన్నా అక్కా తమ్మి చెల్లి
వొదినా అత్తా ముసలి ముతకా
అయ్యా అమ్మా.. ఓ నా ప్రజలారా...
వెతుకుదాం రండి మన సోదరున్ని
ప్రతి ఒక్కరి ముఖంలో రక్తపుగూడు
కట్టుకున్న ఆతని కథను...
ప్రతి ఒక్కరి గుండెను తూట్లు పొడిచి
తొలిచిన ఆ వ్యక్తి వ్యథను...
ఇక ప్రశ్నించకపోతే తవ్వకపోతే
అడకకపోతే పోరాడకపోతే
మన జీవితాలే ప్రశ్నార్థకమై
ఏ అనాగరిక జైళ్లలోనో
ఏ రాబందుల రాజ్యాల్లోనో
అనాథ శవమై తేలుతుంది
రాజ్యాంగ పీఠిక!!!

- రఘు వగ్గు

అతి వేగం అనర్థదాయకం

ప్రతి ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల బారిన పడి వేలాది మంది మృత్యువాత పడుతున్నారు. మద్యపానం సేవించి డ్రైవింగ్‌కు ఉపక్రమించడం, వేళకాని వేళ రోడ్డు ప్రయాణాలకు బయలుదేరడం తీవ్ర హానికరమైన అంశాలే. ముఖ్యంగా యువత ఏ మాత్రం జాగ్రత్తలు పాటించకుండా బైకులపై దూసుకుపోతున్నారు. బైక్, కార్ల రేసులు పెట్టుకొని మరీ దుస్సాహసానికి ఒడిగడుతూ తమ ప్రాణాలను తామే చేజేతులారా పోగొట్టుకుంటున్నారు. మోటార్ సైకిల్‌పై వెళితే హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించాలని ఎంతగా ముందు జాగ్రత్తలు చెబుతున్నప్పటికి, హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికి పెడచెవిన పెట్టడంతో రోడ్డు ప్రమాదాలకు మనం లోనవుతున్నాం. మనలో మార్పు రానంతవరకు, మన వైఖరి మారనంత వరకు ఇలా రోడ్డు ప్రమాదాలకు బలవుతూ, ప్రాణాల మీదకు తెచ్చుకుంటూనే వుంటాం.

- బి. ఎం. రెడ్డి, నంద్యాల.

వ్యాఖ్య

బాంబు బెదిరింపులకు మూల్యం ఎవరు చెల్లించాలి?

నేడు విమానయానం కేవలం సంపన్నులు మాత్రమే కాదు. సాధారణ ప్రజలు కూడా చేస్తున్నారు. నిజానికి విమాన ప్రయాణికులలో వీరే అధికం. ఉపాధి, ఉద్యోగం, విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుంది. అప్పుడు విమానయానాన్నే ఎంచుకుంటారు. అంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న దేశ విమాన సర్వీసులకు సంబంధించి...ఈ మధ్యకాలంలో వస్తున్న బాంబు బెదిరింపులు...సామాన్య ప్రజలను సైతం ఎక్కువగా ప్రభావితం చేశాయంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే బాంబు బెదిరింపులు, విమాన సర్వీస్‌ల రద్దు వల్ల విమానయాన సంస్థలకు కలిగే ఆర్థిక నష్టాన్ని సాధారణ ప్రయాణికులు భరించాల్సి ఉంటుంది.

గత రెండు వారాలుగా, సోషల్ మీడియా ఖాతాల నుండి వచ్చిన బెదిరింపుల కారణంగా విమానయాన సంస్థలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఇప్పటికే దాదాపు 300 విమాన సర్వీసులకు బెదిరింపులు వచ్చాయి. పలు సర్వీసులు ఆలస్యమయ్యాయి. చాలా మందిని దారి మళ్లించి గమ్యాలకు చేర్చాల్సి వచ్చింది. ఎయిర్ ఇండియా, ఇండిగో, విస్తారా, ఆకాషా, స్పైస్ జెట్, అలయన్స్ ఎయిర్ మొదలైన వివిధ సర్వీసులకు వచ్చిన బెదిరింపులన్నీ నకిలీవని తేలింది. నిరంతర బెదిరింపు సందేశాల నేపథ్యంలో, విమానం లోపల, వెలుపల ప్రయాణీకులను తప్పనిసరిగా తనిఖీలు చేయాల్సి వుంటుంది.

ఈ సంక్షోభం కోట్లాది రూపాయల భారాన్ని సృష్టిస్తుంది. సర్వీసు ఆలస్యమైతే దేశీయ విమానాలకు రూ.1.5 కోట్లు, అంతర్జాతీయ విమానాలకు రూ.5 నుంచి 5.5 కోట్ల వరకు అదనంగా ఖర్చు అవుతుంది. ఉదాహరణకు, ముంబై నుంచి న్యూయార్క్ వెళ్లే ఎయిర్ ఇండియా విమానాన్ని ఢిల్లీ విమానాశ్రయం ద్వారానే మళ్లించినప్పటికీ విమానయాన సంస్థకు రూ.3 కోట్ల నష్టం వాటిల్లింది. దేశీయ, విదేశీ విమానాశ్రయాలలో అత్యవసర ల్యాండింగ్, టేకాఫ్ చార్జీలు భరించాల్సి వచ్చింది. అమెరికాలోని జె.ఎఫ్.కె విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు కనీసం నాలుగున్నర లక్షల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. టేకాఫ్ అయిన రెండున్నర గంటల లోపు అత్యవసర ల్యాండింగ్ అవసరమైతే, బోయింగ్ 777 వంటి పెద్ద విమానాలు కనీసం 100 టన్నుల ఇంధనాన్ని వినియోగించాల్సి వుటుంది. కంపెనీలకు 600 కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు తాజా అంచనా. ఈ నేపథ్యంలో కేరళతో పాటు దేశంలోని అన్ని ప్రధాన విమానాశ్రయాల్లో ఏవియేషన్ అధికారులు భద్రతా పరమైన నిబంధనలను కఠినతరం చేశారు.

ఎయిర్‌లైన్ కంపెనీలు ఇచ్చిన హామీ ప్రకారం తమ గమ్యాన్ని చేరుకోలేని ప్రయాణికులు పరిహారం కోసం దావా వేస్తారు. ఇది ఆర్థికంగా కూడా నష్టదాయకమైనది. ఆశించిన ఉద్యోగం సాధించలేక, ఇంటర్వ్యూకు హాజరు కాలేక, పోటీ పరీక్ష రాయలేక, ఆలస్యం కారణంగా వ్యాపారంలో భారీగా నష్టపోయిన వారు పరిహారం కోసం కోర్టును ఆశ్రయించడం సహజం. కంపెనీల విశ్వసనీయతకూ పెద్ద దెబ్బ. ఇప్పటి వరకు సాధించుకున్న ప్రతిష్ట మొత్తం తుడిచిపెట్టుకుపోతుంది. కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో కూడా ఎదురుదెబ్బలు తగిలే అవకాశం ఉంది.

> ఈ కంపెనీలు భవిష్యత్తులో ఈ నష్టాన్ని ప్రయాణికుల నుండి వసూలు చేయడానికి ప్రయతిస్తాయి. ప్రయాణ చార్జీలు, ఇతర సర్వీస్ చార్జీలను విపరీతంగా పెంచడంతో పాటు, క్రమంగా నష్టాన్ని ప్రయాణికులపై మోపుతాయి. వీటిని అరికట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖపై ఉంది. ఈ బాంబు బెదిరింపుల కారణంగా ప్రయాణికులపై భారం మోపే ప్రయత్నాన్ని మొగ్గలోనే తుంచేయాల్సిన బాధ్యత కూడా వాటిపై ఉంది. అయితే, రెండు వారాలు గడుస్తున్నప్పటికీ...ఎడతెగని ఈ బెదిరింపు సందేశాల కారణాన్ని కనుగొనడంలో కేంద్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.



ఈ కంపెనీలు భవిష్యత్తులో ఈ నష్టాన్ని ప్రయాణికుల నుండి వసూలు చేయడానికి ప్రయతిస్తాయి. ప్రయాణ చార్జీలు, ఇతర సర్వీస్ చార్జీలను విపరీతంగా పెంచడంతో పాటు, క్రమంగా నష్టాన్ని ప్రయాణికులపై మోపుతాయి. వీటిని అరికట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖపై ఉంది. ఈ బాంబు బెదిరింపుల కారణంగా ప్రయాణికులపై భారం మోపే ప్రయత్నాన్ని మొగ్గలోనే తుంచేయాల్సిన బాధ్యత కూడా వాటిపై ఉంది. అయితే, రెండు వారాలు గడుస్తున్నప్పటికీ...ఎడతెగని ఈ బెదిరింపు సందేశాల కారణాన్ని కనుగొనడంలో కేంద్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. బెదిరింపు సందేశాలు పంపే వారి ప్రయాణంపై నిషేధం విధిస్తామని విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పడం మినహా ఈ విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ఇందుకు సోషల్ మీడియా దిగ్గజాలు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా లను తప్పుబడుతున్నారు. బెదిరింపు సందేశాన్ని పోస్ట్ చేసిన వారి వివరాలను ఈ 'ఎక్స్', 'మెటా' అందజేయనందున నేరస్థులను పట్టుకోలేక పోయారనే వాదన ఏ విధంగానూ సమర్థనీయం కాదు. కొంతమంది నేరగాళ్లు సోషల్ మీడియా ద్వారా మన దర్యాప్తు సంస్థలను బెదిరిస్తుండగా, మోడీ ప్రభుత్వం నిస్సహాయంగా చూస్తుండిపోవడం క్షంతవ్యం కాదు.

/ 'దేశాభిమాని' సంపాదకీయం /

విద్యాసాగర్‌కు ఎదురుదెబ్బ

ప్రజాశక్తి-అమరావతి

నిందితులను అరెస్టు చేసేప్పుడు కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. కస్టోడియల్ రిమాండ్ నుంచి కాపాడుకునేందుకు బెయిల్ కోరేందుకు వీలుండాలంది. అరెస్టుకు కారణాలు నిందితులకు రాతపూర్వకంగా తెలియజేసే వ్యవహారంపై ఏకీకృత విధానాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించింది. అరెస్టయిన వ్యక్తికి కూడా హక్కులుంటాయని, మానవ హక్కులు కూడా ఉంటాయని చెప్పింది. సినీ నటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో రిమాండ్ విధించడాన్ని సవాలు చేస్తూ వ్యాపారవేత్త విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ సమయంలోనే పైవిధంగా డిజిపికి ఆదేశాలు జారీ చేస్తూ జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి సోమవారం తీర్పు వెలువరించారు. విజయవాడ కోర్టు విధించిన రిమాండ్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదన్నారు.

జెఇఇ మెయిన్స్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జెఇఇ (మెయిన్) పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. రెండు సెషన్లుగా ఈ పరీక్షలు నిర్వహించనుంది. జెఇఇ సెషన్-1ను జనవరిలో, సెషన్-2ను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జనవరి సెషన్‌కి సంబంధించి.. అక్టోబరు 28 నుంచి నవంబర్ 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ సెషన్‌కు సంబంధించి 2025 జనవరి 22 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 12 లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్‌టిఎ తెలిపింది.

బెదిరింపులు, కేసులకు భయపడకుండా
కొనసాగుతున్న ఆందోళనలు

- ఎసిసి ఫ్యాక్టరీ స్థలాల్లో పాకలు వేస్తున్న కార్మిక కుటుంబాలు



ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై, తమకు మద్దతుగా నిలిచిన కార్మిక నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అంటూ ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పెద్ద ఎత్తున గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బ్రహ్మానందపురం సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో సోమవారం నిరసన చేపట్టారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని, భూ పోరాటం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. తాడేపల్లి యూనియన్ కార్యాలయం నుంచి ఫ్యాక్టరీ భూముల వరకూ నిర్వహించిన ప్రదర్శనలో 20 ఏళ్ల వయస్సు నుంచి 70 ఏళ్ల వృద్ధులు సైతం పాల్గొన్నారు. పోలీసులు అక్రమ కేసులు, ఎన్నారై ప్రతినిధుల బెదిరింపులు కొనసాగుతున్న పర్వంలో కార్మికులు మొక్కవోని దీక్షతో ఫ్యాక్టరీ స్థలంలో పాకలు వేసుకునే ప్రక్రియ మరోపక్క కొనసాగించారు. గతంలో ఫ్యాక్టరీలో పనిచేసి చనిపోయిన కార్మికుల బంధువులు, వారి పిల్లల సైతం మేము సైతం అంటూ పోరాటంలో భాగస్వామ్యులయ్యారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో కార్మికులకు మద్దతు తెలిపిన నాయకులు సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఐ ఎంఎల్ నాయకులు స్వామి, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం దశాబ్దాల పాటు ఎదురుచూసి, చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో భూముల్లోకి దిగిన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై, వారికి అండగా నిలిచిన కార్మిక నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని తప్పుపట్టారు. ఈ క్రమంలో కేసులో ఉన్న 22 మంది స్టేషన్‌కు రావాలని, డిఎస్‌పి వారితో మాట్లాడతారని చెప్పడాన్ని నిరసించారు. భూముల్లో పాకలు వేసుకుంటున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై ఎన్నారై ప్రతినిధులు దౌర్జన్యానికి దిగారు.

భూముల్లో ఉన్న ముళ్ల కంపను తొలగించడానికి ఉపయోగించిన పరికరాలను లాక్కొని పనులు నిలిపివేయాలని బెదిరించారు. ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధుల బెదిరింపులకు లొంగక మహిళా కార్మికుల సైతం తమ తమ ఇళ్లను నిర్మించుకునే క్రమంలో నిమగ్నమయ్యారు.

వరద బాధితులకు మరో అవకాశం : సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : విజయవాడ నగరంలోని వరద బాధితుల్లో సాయం అందనివారుంటే దరఖాస్తు చేసుకోవచ్చని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పిసిసోడియా తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు బాధితులకు మరో అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులుంటే తప్పనిసరిగా సాయం చేస్తామని తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వడానికి అనేక అవకా శాలు ఇచ్చిందన్నారు. బాధితుల వివరాలన్నీ అత్యంత పారదర్శకంగా గ్రామ, వార్డు సచివాల యాల్లో డిస్‌ప్లే చేసి పరిహారం అందజేశామని తెలిపారు. 1,46,318 మంది బాధితులకు నేరుగా వారి ఖాతాల్లోకి రూ.238.38 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌బిఐ 90వ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

- విజేతగా ఐఐపిఇ విశాఖ బృందం
- ఆర్‌బిఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) స్థాపించి 90 ఏళ్లయిన సందర్భంగా ఆర్‌బిఐ 90వ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్లు ఆర్‌బిఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు ఆన్‌లైన్ ఆధారంగా జరిగిన ప్రాథమిక క్విజ్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల బృందాలకు సోమవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. నగరంలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 83 బృందాలకు చెందిన 166 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు. ఈ పోటీల్లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ -విశాఖపట్నం)కి చెందిన కృతజ్ఞ శర్మ, ఉజ్వల్ నారాయణ్ బృందం విజేతగా నిలిచిందని తెలిపారు. అలాగే స్పేసెస్ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానంలో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (కర్నూలు) తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. మొదటిస్థానంలో నిలిచిన బృందానికి రూ.రెండు లక్షలు, ద్వితీయ స్థానం బృందానికి రూ.1.5 లక్షలు, తృతీయ స్థానం బృందానికి రూ.లక్ష నగదు బహుమతి అందజేసినట్లు వివరించారు. విజేతగా నిలిచిన బృందాలు నవంబర్ 21 నుంచి డిసెంబర్ నాలుగు మధ్య జోనల్ రౌండ్‌లో పోటీ పడతాయని తెలిపారు. ముంబయిలో నిర్వహించే జాతీయ స్థాయిలో ఫైనల్ పోటీలు డిసెంబర్‌లో జరగనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ ఎఫ్‌ఐడిడి జిఎం మహేన, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అన్ని జిల్లాల ఎల్‌డిఎంలు తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ ప్రారంభించాల్సిందే

- అఖిలపక్ష ఆధ్వర్యంలో పోరాడుతాం: సోమిరెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను తిరిగి ప్రారంభించాలని పోర్టు సిఇఒను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అఖిలపక్ష పార్టీల నేతలతో కలిసి సిఇఒ జగదీష్ పటేల్‌ను ఆయన కలిశారు. అనంతరం మీడియాతో సోమిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత ధనికులైన అదాని... కంటైనర్ టెర్మినల్‌ను నడపలేరా? అని ప్రశ్నించారు. పది వేల మంది కార్మికుల ఉద్యోగాలు పోయాయని, వేలాది ఎకరాల భూమిని పోర్టు కోసం ప్రజలు ఇచ్చారని, ఇప్పుడు కంటైనర్ పోర్టును చెన్నైకి తీసుకువెళితే చూస్తు ఊరుకోబోమన్నారు. తాము కేవలం రైతులు, కార్మికులు, స్థానికులు ప్రయోజనాల కోసమే పోరాటం చేస్తున్నామన్నారు. ఇరవై రోజుల్లో ఒక ప్రకటన చేస్తామని చెప్పారని, లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదిర్శవర్గ సభ్యులు ఎం. మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రజలు పండించిన అనేక పంటలు పోర్టు నుంచి ఎగుమతి అయ్యాయన్నారు. కంటైనర్ పోర్టు వెళ్లిపోవడంతో ఆరు వందల ఏజెన్సీలు మూతపడ్డాయని, పది వేల మందికి ఉద్యోగం, ఉపాధి పోయిందన్నారు. సిఇఒను కలిసిన వారిలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సిఐటియు నాయకులు గోగుల శ్రీనివాసులు, సిపిఐ నాయకులు శంకర్ కిషోర్, బిజెపి నాయకులు కె. ఆంజనేయరెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులున్నారు.

వైసిపి నేత వైవి రామిరెడ్డి అరెస్టు

అక్రమ మైనింగ్ కేసులో వైసిపి నేత వైవి రామిరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరు జిల్లా రాపూరు ప్రాంతంలోని ఎస్‌ఎల్‌వి టోన్ క్రషర్‌ను గతంలో మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన క్రస్టర్ల నుంచి ఈ నెల 23, 24 తేదీల్లో అక్రమ మైనింగ్ చేశారని పోలీసులకు తహశీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో క్రషర్ అధినేత వైసిపి నేత వైవి రామిరెడ్డిని సోమవారం రాపూరు పోలీసులు నెల్లూరులో అరెస్టు చేశారు. అక్కడి నుంచి ఆయనను వెంకటగిరి కోర్టుకు తరలించారు. జడ్జి సెలవులో ఉండడంతో సూళ్లూరుపేట జడ్జి ఎదుట హాజరుపరచినట్లు సమాచారం. ఆయనకు రిమాండ్ విధించినట్లు తెలిసింది.

పనిచేసే చోట ఉద్యోగులకు రక్షణ

- గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులు ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకునే పరిస్థితులు కల్పించాలని, అలా లేని ప్రాంతాల్లో ఆయా ఉద్యోగులకు చట్టపరంగా రక్షణ కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, సహ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్‌డి జాని పాషా, జి హరీంద్ర, బత్తుల అంకమ్మరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లాలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎద్దు శశిభూషణ్ వార్డు సచివాలయ అడ్మిన్ ఉద్యోగుల గూబ కొట్టండని చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రీపోస్టుమార్టంపై నేడు విచారణ

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి కార్యకర్తల చేతిలో తన భర్త, వైసిపి కార్యకర్త బండి చెంచయ్య అలియాస్ పోతురాజు హత్యకు గురయ్యాడని, తన భర్త మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించాలంటూ హతుని భార్య బండి ప్రమీలమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పెళ్లకూరు సిఐ నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడం లేదన్నారు. దర్యాప్తు అధికారిని మార్చేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, వడ్డిపాళెం గ్రామంలో వైసిపి కార్యకర్త చెంచయ్య హత్యకు గురయ్యాడు. రీపోస్టుమార్టం చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం విచారణ చేస్తామని న్యాయమూర్తి జస్టిస్ చక్రవర్తి ప్రకటించారు.

ఇవిఎంలు, వివి ప్యాట్లపై పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

ఇవిఎంలు, వివి ప్యాట్ల తనిఖీలు, పరిశీలనకు బదులుగా మాక్ పోలింగ్ చేయాలనే కేంద్ర ఎన్నికల సంఘం గత జులై 16న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఇసి జారీ చేసిన టి-ఎస్వోపీ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమనే వాదనను తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం తీర్పు చెప్పారు మాక్ పోలింగ్ నిర్వహణ విషయంలో తాము జారీ చేసిన ఎస్వోపీ సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే ఉందంటూ ఇసి చేసిన వాదనను ఆమోదించారు. ఎన్నికల్లో ఓడిన అభ్యర్థి ఎన్నికల పిటిషన్ దాఖలు చేసి, అందులో వివిప్యాట్ లెక్కింపునకు హైకోర్టు ఆదేశాలు ఇస్తే తప్ప వాటిని తెరిచేందుకు వీల్లేదనే వాదనను సమ్మతించారు.



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు వేమూరి నాగేశ్వరరావు

రోడ్డుకు మరమ్మతులు చేయాలని పాదయాత్ర

ప్రజాశక్తి -కంకిపాడు/గుడివాడ

కంకిపాడు-గుడివాడ రహదారికి మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటిగుంట నుంచి గుడివాడ ఆర్‌డిఒ కార్యాలయం వరకు సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా కంకిపాడు-గుడివాడ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడి అనేక మంది మృతి చెందారని చెప్పారు. తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని, లేకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కోమటిగుంట నుంచి గుడివాడ వరకు 24 కిలోమీటర్లు నాయకులు పాదయాత్ర చేశారు. అనంతరం స్థానిక ఆర్‌డిఒకు, ఆర్అండ్‌బి డిఇఇకెకు వినతి పత్రం అందజేశారు.

కాశ్మీర్ ప్రజల కోసం పోరాడతాం

- తీహార్ జైలులో లొంగిపోయిన బారాముల్లా ఎంపీ రషీద్

న్యూఢిల్లీ : కాశ్మీర్ ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అన్నారు. ఉగ్రవాద నిధుల కేసులో మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో తీహార్ జైలులో సోమవారం లొంగిపోయారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడారు.

జగన్ మాటలు అసత్యాలే

● టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసత్యాలతో ప్రజలను నమ్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల రాష్ట్ర ప్రజలను తొక్కిపెట్టి ప్రజాస్వామ్య వ్యతిరేక పరిపాలనతో జగన్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో కలిసి టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను ఇరువురు స్వీకరించారు. 20 ఏళ్లలో రూ.8 లక్షల కోట్లు ఎలా వచ్చాయో జగన్ చెప్పాలని ప్రశ్నించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు

● పిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నియోజకవర్గ నాయకులతో ఆమె విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారిలో భరోసా కల్పించేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గాల వారీ ప్రతి వారం రెండు పర్యాయాలు సమావేశాలు నిర్వహించి కేడర్‌లో నూతనుత్తేజం నింపాలన్నారు. విశ్వసనీయత కలిగిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో గుర్తింపు ఉందన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బిజెపి, హామీలిచ్చి మోసం చేసిన వైసిపి, ఇచ్చిన హామీలు అమలు చేయని టిడిపి, జనసేన పార్టీలకు విశ్వసనీయత లేదన్నారు.

సంస్కృతి, ఫాసిజమే ఆధిపత్య సాధనలు

● రాఘవాచారి స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ కాశీం



సి.రాఘవాచారి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రొఫెసర్ కాశీం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రపంచ దేశాల్లో మానవ, ఆర్థిక వనరులపై ఆధిపత్యం సాధించడానికి సామ్రాజ్యవాదులకు ఆయా దేశాల సంస్కృతి, ఫాసిజం సాధనాలుగా ఉన్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. 'సంస్కృతి- ఫాసిజం' అనే అంశంపై విశాలాంధ్ర పూర్వ సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి 5వ స్మారకోపన్యాసం చేశారు. సి.రాఘవాచారి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ అకాడమి ఆడిటోరియంలో సోమవారం ట్రస్ట్ సభ్యులు అక్కినేని చంద్రరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాశీం మాట్లాడుతూ.. మనిషి పుట్టిన నాటి నుంచి చనిపోయే వరకు జరిగే ప్రతి ఆలోచనలు, ఆచరణలే వ్యక్తి సంస్కృతి అన్నారు. ఆహారం, వస్త్రధారణ, ఆచారాలు అన్నీ సంస్కృతిలో భాగాలన్నారు. పాలకుల సంస్కృతి, పాలితుల సంస్కృతి వేర్వేరుగా ఉంటాయన్నారు. హేతువాదం అనేది ఒక విలువ అని, దానిని భారత రాజ్యాంగం గుర్తించిందని అన్నారు. మెజార్టీ ప్రజల సాధనాలు పాలకులకు అనుకూలంగా ఉండే ఆలోచనలను రేకెత్తిస్తాయని చెప్పారు. ప్రసార సాధనాల్లో వచ్చే ప్రకటనలు యువతను బాధ్యత గల పౌరులుగా తీర్చదిద్దటం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోవడానికి తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందనే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దుర్గగుడి వద్ద విన్యాసాలు చేశారని చెప్పారు. మనుషులను నియంత్రించటానికి ఆధర్మ ప్రవర్తన నిర్దేశిస్తున్నారన్నారు. దేశంలో ముస్లింలను అణచివేయటానికి ప్రణాళిక అమలు అవుతోందన్నారు. దేశభక్తితో ఉండే మాజీ సైనికుల్ని, మేధావులను గుర్తింపు పొందాలనుకుంటే వారిని దగ్గరకు తీసుకుని ఫాసిజం ఆదరిస్తోందన్నారు. వారిని ప్రశ్నిస్తే దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాసిజం అనే మాటను బూర్జువా పార్టీకి చెందిన రాహుల్ గాంధీ కూడా వాడుతున్నారని చెప్పారు. ఫాసిజాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిఘటిస్తే, బిజెపి కొనసాగిస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా బిజెపి నమూనా ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలోనే కమ్యూనిస్టులపై నిర్బంధానికి దాడి చేస్తోందన్నారు. వర్గపోరాటంలో ఉన్న వారు మాత్రమే ఫాసిజం నుంచి దేశాన్ని కాపాడగలరని తెలిపారు. ముందుగా కెఎల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి.జమిందార్ నేతృత్వంలో 'యుద్ధాలు-దుష్పలితాలు' అంశంపై లఘు చిత్రం ప్రదర్శించారు.

త్వరలో నైపుణ్య గణన

● సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ సెన్సెస్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య గణన కార్యక్రమం త్వరలో చేపట్టనున్నట్లు సొసైటీ ఫర్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఛైర్మన్ దీపక్‌రెడ్డి గుణపాటి తెలిపారు. ఇది ప్రజల నైపుణ్యాలను గుర్తించి, వాటిని మ్యాపింగ్ చేయడానికి ఉద్దేశించిన కార్యక్రమమన్నారు. విజయవాడలోని సీడాప్ కార్యాలయంలో సృజనాత్మకత, భవిష్యత్ నైపుణ్యాలు అనే అంశంపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన, వాటి వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దేశానికే స్కిల్ సెన్సెస్ మార్గదర్శకం కానున్నట్లు చెప్పారు. సీడాప్ ఆధ్వర్యాన ఇప్పటి వరకూ 1.36 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. వీరిలో 1.04 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇకపై ఏడాదికి లక్ష మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సీడాప్ ప్రస్తుతం డిడియుజికెవై కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, భవిష్యత్తులో మరో 12 శిక్షణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు రాష్ట్రాన్ని అత్యుత్తమ నైపుణ్యాలు కలిగిన యువతకు గమ్యస్థానంగా మార్చాలనే కృతనిశ్చయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు ఇప్పటికే 6 కొత్త పారిశ్రామిక విధానాలను ప్రకటించారని, అవన్నీ పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. రాష్ట్రాన్ని దేశానికే నైపుణ్య రాజధానిగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎపిఐఐసి, ఎంఎస్ఎంఇ, ఎపిటిడిసి, లీడ్ క్యాప్, మారిటైమ్ బోర్డు వంటి ఇతర కార్పొరేషన్ల ఛైర్మన్లు అందరితో సమావేశమై స్కిల్ ఎపి దిశగా సమన్వయంతో పని చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీడాప్ సిఇఒ ఎన్‌కెవి శ్రీనివాసులు, ఇడి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లలో ప్రవేశ రుసుం !

● మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

పర్యాటకుల కోసం నాలుగు బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గుంటూరులో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... స్వదేశీ ఐకాన్ ప్రాజెక్టు ద్వారా సముద్ర తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని, తొలి దశలో సూర్యలంక, కాకినాడ, రుషికొండ, రామాయపట్నం బీచ్‌లను ఎంపిక చేశామన్నారు. ఈ బీచ్‌ల వద్ద మౌలిక సదుపాయలను కల్పించేందుకు డిపిఆర్‌లు సిద్ధం చేయమని అధికారులకు సూచించామన్నారు. నిర్వహణ ఖర్చుల నిమిత్తం పర్యాటకుల నుంచి ఎంట్రీ ఫీజును వసూలు చేయాలని ఆలోచిస్తున్నామని తెలిపారు. అయితే ఎంత వసూలు చేయాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలానికి సీప్లైయిన్ నవంబర్ తొమ్మిదిన సిఎం చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. రివర్ ఫ్రంట్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఆధ్యాత్మిక యాత్రలను పెంచుతామన్నారు. పర్యాటకంలో దేశంలో రాష్ట్రం మూడో స్థానంలో ఉందని, దీనిని మొదటి స్థానానికి తీసుకువస్తామన్నారు. రుషికొండ ప్యాలెస్‌ను దేని కోసం ఉపయోగించాలన్నదీ ఇంకా నిర్ణయించలేదని, ప్రజల కోసమే వాడతామని వెల్లడించారు.

పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు

● టెస్లా సిఎఫ్ఒతో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూలమైన, సులభతరమైన విధానాలు అమలు చేస్తున్నామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆస్టిన్‌లోని టెస్లా కేంద్ర కార్యాలయాన్ని మంత్రి సోమవారం సందర్శించారు. అనంతరం ఆ కంపెనీ సిఎఫ్ఒ వైభవ్ తనేజాతో సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా సౌరశక్తి నిల్వ వ్యవస్థలు, ముఖ్యంగా స్మార్ట్ సిటీలు, గ్రామీణ విద్యుద్దీకరణకు సౌర ఫలకాలకు అమర్చడంలో భాగస్వామ్యం వహించాలని కోరారు. గ్రీన్ ఎనర్జీ ఆశయాలకు అనుగుణంగా రెన్యువబుల్ ఎనర్జీపై దృష్టిసారిస్తే సహకారం అందిస్తామని తెలిపారు. ఎపిలో రాబోయే డేటా సెంటర్, ఐటి హబ్‌లకు వినూత్న బ్యాటరీ పవర్ స్టోరేజ్ పరిష్కారాలు అవసరమని తెలిపారు. టెస్లా ఎపికి వస్తే ఈ రంగంలో కీలకపాత్ర వహించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈవి ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం, సూపర్ ఛార్జింగ్ టెక్నాలజీ అమలులో భాగస్వామ్యం వహించాలని కోరారు. ఆర్‌అండ్‌డి, ఇన్నోవేషన్‌లో కీలక పాత్ర పోషిస్తూ స్థిరమైన ఇంధన పరిష్కారాలపై దృష్టి సారించిన టెస్లా ఎపిలో టెక్నాలజీ పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ లక్ష్యసాధనకు టెస్లా వంటి అగ్రశ్రేణి గ్లోబల్ కంపెనీల సహాయ, సహకారాలు అవసరమని తెలిపారు.



పెరోట్ గ్రూప్ ఛైర్మన్‌తో భేటీ

పెరోట్ గ్రూప్ అండ్ హిల్‌వుడ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ రాస్‌పెరోట్ జూనియర్‌తో లోకేష్ భేటీ అయ్యారు. ఇన్నోవేటివ్ రియల్ ఎస్టేట్ అండ్ పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టుల్లో మీ వినూత్న విధానాలు తమ రాష్ట్ర ఆర్థిక వృద్ధి, స్థిరత్వానికి తోడ్పడతాయని పెరోట్‌తో అన్నారు. అలయన్స్ టెక్సాస్ వంటి రాష్ట్ర మౌలిక సదుపాయాల వృద్ధి వ్యూహంతో బాగా సరిపోతాయని పేర్కొన్నారు. ఈ తరహాలో పారిశ్రామిక, లాజిస్టిక్ పార్కులను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని తీరప్రాంతంలో అనువైన వాతావరణం నెలకొందని తెలిపారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో భాగస్వామ్యం వహించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

త్వరలో నూతన కౌల్దార్ల చట్టం : మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే శాసనసభ సమావేశాల్లో నూతన కౌల్దార్ల చట్టం ప్రవేశపెడతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన డిఆర్‌సి సమావేశం, అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈ చట్టంపై ఇప్పటికే ముసాయిదా సిద్ధమైందని తెలిపారు. ఈ ముసాయిదాపై నవంబరు ఆరున జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నట్టు చెప్పారు. 2019లో తీసుకువచ్చిన కౌలు రైతుల చట్టం స్థానంలో నూతన బిల్లు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. మూడు సిలిండర్లకు సంబంధించిన విధివిధానాలు ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపామని ఈనెల 31న సిఎం చంద్రబాబు నాయుడు రూ.900 కోట్ల చెక్కులను ఆయిల్ కంపెనీలకు అందచేస్తారని తెలిపారు. ఈ సొమ్మును గ్యాస్ వినియోగదారులకు వారి ఖాతాల్లో సబ్సిడీ జమ అయ్యేలా చూస్తామన్నారు. ఈనెల 29 నుంచి గ్యాస్ బుక్ చేసుకున్న వారందరికి సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో వారి బ్యాంకు అకౌంట్‌లో సబ్సిడీ సొమ్ము జమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో కళాశాలలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కారు

● మోడీ ప్రభుత్వంపై ప్రియాంక మండిపాటు



సభలో మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ

వాయనాడ్ : కేరళలోని వయనాడ్‌లో రెండో విడత ప్రచారాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అభ్యర్థి, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సోమవారం కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్‌డిఎ పాలనలో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కారని విమర్శించారు. మీనాన్‌గడీలో జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ మణిపూర్ హింసను ప్రస్తావించారు. దేశంలోని మైనారిటీలపై ఓ పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయని చెప్పారు. 'కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనారిటీలలో భయాన్ని, ఆగ్రహాన్ని, ఆవేదనను వ్యాపింపజేస్తున్న విషయం మీకు తెలుసు. మైనారిటీలపై జరిగిన దాడులను మీరు చూశారు. మణిపూర్‌లో జరిగిన హింసను చూశారు. ఓ పథకం ప్రకారం విద్వేషాన్ని వ్యాప్తి చేశారు. మైనారిటీలలో భయాన్ని రేకెత్తించారు' అని ప్రియాంక అన్నారు. సామాన్య ప్రజలకు బదులుగా నరేంద్ర మోడీ స్నేహితుల కోసం ప్రభుత్వం అనేక విధానాలు రూపొందించిందని విమర్శించారు. రాత్రింబవళ్లు కష్టించి పనిచేసే రైతులపై ఈ ప్రభుత్వానికి కనికరం లేదని, గిరిజనుల సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని అంటూ వారి భూములను సంపన్నులు ఆక్రమిస్తున్నారని చెప్పారు. వయనాడ్ స్థానానికి రాజీనామా చేసినప్పుడు తన సోదరుడు రాహుల్ గాంధీ ఎంత ఆవేదన చెందాడో తనకు తెలుసునని అన్నారు. రాజ్యాంగ విలువల కోసం, ప్రజాస్వామ్యం కోసం రాహుల్ నాయకత్వంలో పోరాడుతున్నామని చెప్పారు. నియోజకవర్గంలో మరో రెండు సభలలో కూడా ఆమె ప్రసంగించారు. వయనాడ్‌లో ఎల్‌డిఎఫ్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకెరీతో ప్రియాంక తలపడుతున్నారు. అక్కడ బిజెపి అభ్యర్థిగా నవ్య హరిదాస్ పోటీ చేస్తున్నారు.

నకిలీవి.. నాణ్యత లేనివి

● 71 మందులను గుర్తించిన సిడిఎస్‌సిఒ
● వీటిలో యాంటీబయాటిక్స్, దగ్గు సిరప్‌లు, డయాబెటిక్, బిపి మందులు

న్యూఢిల్లీ : దేశంలో వైద్య, ఆరోగ్య సంరక్షణ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో నకిలీ, నాణ్యతా ప్రమాణాలు పాటించని (ఎన్ఎస్‌క్యూ) మందులు మరింత ఆందోళనను కలిగిస్తున్నాయి. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) ఇలాంటి 71 మందులను గుర్తించింది. ఇందులో ఎన్ఎస్‌క్యూ మందులు 67 కాగా, నాలుగు నకిలీ మందులు ఉన్నాయి. ఈ జాబితాలో సాధారణంగా వినియోగించే పాన్ డి, షెల్‌కాల్ 500లతో పాటు మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముడయ్యే మందులు కూడా ఉన్నాయి. యాంటీ బయాటిక్‌లు, దగ్గు సిరప్‌లు, మధుమేహం, బిపికి సంబంధించిన మందులు కూడా ఉన్నట్టు సమాచారం. పాన్-డి, యురిమాక్స్-డి, షెల్‌కాల్ 500, డెకా-డ్యూరాబొలిన్ 25 ఐఎన్‌జె రకాలలో నకిలీలను సిడిఎస్‌సిఒ గుర్తించింది. నాణ్యతా ప్రమాణాలు పాటించటంలో విఫలమైన 67 రకాల మందుల (ఎన్ఎస్‌క్యూ మందులు) జాబితాను సిడిఎస్‌సిఒ విడుదల చేసింది. ఈ జాబితాలో యాంటిబయాటిక్స్, మధుమేహ మందులున్నాయి. వీటిని స్విస్ బయోటెక్ పేరెంటరల్స్, జీ లేబొరేటరీస్ లిమిటెడ్‌లు ఉత్పత్తి చేశాయి. అలాగే ఎపెయిన్, యాంటీ ఇన్‌ఫ్లెమెటరీ డ్రగ్స్, గుండె, బిపి మందులు, డైయురెటిక్స్, గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ డ్రగ్స్‌తో పాటు పలు మందులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

డిజిటల్ అరెస్ట్ మోసాలతో రూ.120 కోట్లకు టోపీ

- సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ వెల్లడి

న్యూఢిల్లీ : ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో డిజిటల్ అరెస్ట్ మోసాల వల్ల భారతీయులు రూ.120 కోట్లను కోల్పోయారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. సైబర్ మోసగాళ్లు చట్టాన్ని అమలు చేసే అధికారులుగా వ్యవహరిస్తూ... చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేలా చేసి.. బాధితుల నుంచి డబ్బును డిమాండ్ చేసే వ్యవహారాన్నే డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్స్ అంటారు. ఈ వ్యవహారం గురించి ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (జనవరి – ఏప్రిల్) భారతీయులు డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్స్ వల్ల రూ.120.30 కోట్లు, ట్రేడింగ్ స్కామ్ వల్ల రూ.1,420.48 కోట్లు, పెట్టుబడుల కుంభకోణం వల్ల రూ. 222.58 కోట్లు, రొమాన్స్ అండ్ డేటింగ్ స్కామ్ వల్ల రూ.13.23 కోట్లను కోల్పోయినట్లు గుర్తించాము. డిజిటల్ అరెస్ట్ మోసాలకు పాల్పడే వారిలో చాలామంది లావోస్, మయన్మార్, కంబోడియాలో ఉంటున్నారు. ఈ దేశాల్లో ఉన్నవారు ఉద్యోగ ఉపాధి అవకాశాల పేరుతో భారతీయుల్ని సోషల్‌మీడియా ద్వారా ట్రాప్ చేసి.. వారి ద్వారా సైబర్ క్రైమ్ నేరాలకు పాల్పడుతున్నారు' అని తెలిపారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెలల మధ్య కాలంలో 7.4 లక్షల ఫిర్యాదులు వచ్చాయని నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) డేటా వెల్లడించింది. 2023 సంవత్సర కాలంలో 15.56 లక్షల ఫిర్యాదులు, 2022లో 9.66 లక్షల ఫిర్యాదులు అందాయని పేర్కొంది.

లిథువేనియా ఎన్నికల్లో సెంటర్ లెఫ్ట్ సంకీర్ణం విజయం

విల్నియస్ : లిథువేనియా సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షమైన మధ్యేవాద వామపక్ష పార్టీల కూటమి విజయం సాధించింది. ఆదివారం జరిగిన జాతీయ ఎన్నికల తుది రౌండ్‌లో మితవాద పాలక సంకీర్ణంపై మధ్యేవాద, వామపక్ష పార్టీలు పై చేయి సాధించాయి. 141 సీట్లు ఉన్న పార్లమెంట్‌లో సోషల్ డెమోక్రాట్లు 52సీట్లు గెలుచుకున్నారు. . దీంతో మితవాద ప్రధాని ఇంగ్రిడా సిమొనైట్ నేతృత్వంలో నాలుగేళ్ళ పాలనకు తెరపడింది. మరో రెండు చిన్న పార్టీలైన డెమోక్రటిక్ యూనియన్ 14 సీట్లు, యూనియన్ ఆఫ్ పెజెంట్స్ అండ్ గ్రీన్స్ 8 సీట్లను గెలుచుకున్నాయి. వీటితో కలిసి సోషల్ డెమోక్రాట్లు మెజారిటీ మంత్రివర్గ ఏర్పాటుపై చర్చలు జరపనున్నారు. ఈ సంకీర్ణానికి 74 స్థానాలు లభిస్తాయి. రెండు రౌండ్లుగా జరిగిన ఈ ఎన్నికలో పాలక సంకీర్ణం 28సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. ప్రజలు మార్పును కోరుకున్నారని, పూర్తి భిన్నమైన ప్రభుత్వం కావాలని అనుకున్నారని ఈ ఫలితాలతో వెల్లడైందని సోషల్ డెమోక్రాట్ నేత విలిజా బ్లింకివిసిటె వ్యాఖ్యానించారు.

ఎలక్టోరల్ కాలేజి పద్ధతి వద్దు

- పాపులర్ ఓటు ద్వారానే అధ్యక్షుడు ఎన్నుకోబడాలి
- మెజారిటీ అమెరికన్ల మనోగతం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి ఇప్పటివరకు అమల్లో వున్న ఎలక్టోరల్ కాలేజిని రద్దు చేయాలని మెజారిటీ అమెరికన్లు అభిప్రాయపడుతున్నారు. ఎలక్టోరల్ కాలేజీ ద్వారా కన్నా దేశాధ్యక్షుడిని ప్రత్యక్ష ఓటు ద్వారా ఎన్నుకోవడమే సరైనదని 63శాతం మంది పౌరులు పేర్కొన్నారు. పా రీసెర్చ్ సెంటర్ (పిఆర్‌సి) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రస్తుత ప్రక్రియను ఎత్తివేయాలని 80శాతం మంది డెమోక్రాట్లు, 47శాతం మంది రిపబ్లికన్లు భావిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పలు పబ్లిక్ సర్వేల్లో కూడా ఇదే విషయం స్పష్టమైంది. దేశంలోనే అధిక జనాభా కలిగిన కాలిఫోర్నియా స్టేట్‌లో ప్రతి 10మంది ఓటర్లలో ఏడుగురు దీనికే ఓటు వేశారు. మసాచుసెట్స్ యూనివర్శిటీ నిర్వహించిన మరోసర్వేలో కూడా ప్రతి పది మందిలో ఆరుగురు మహిళలు ఎలక్టోరల్‌కాలేజీ రద్దుకే ఓటేశారు. ఎలక్టోరల్ కాలేజీ అన్నది కాలం చెల్లిన వివక్ష అవశేషమని, దీనివల్ల ఓటర్లకు ప్రమాదకరమైన పర్యవసానాలు వుంటాయని లీగ్ ఆఫ్ వుమెన్ ఓటర్స్ సిఇఓ సెలినా స్టీవార్ట్ వ్యాఖ్యానించారు. గత రెండు శతాబ్దాలుగా ఇదే పద్ధతి అమెరికాలో అమలవుతూ వస్తోంది. అయినా ఈ పరిస్థితి మారాలని మెజారిటీ అమెరిన్లు కోరుకుంటున్నారు.

ప్రైవేట్ రంగంలో తొలి సైనిక విమాన ప్లాంట్

(మొదటి పేజీ తరువాయి)

స్పెయిన్ ఏరోస్పేస్ కంపెనీ సిఎఎస్‌ఎ డిజైన్ చేసి నిర్మించింది. ప్రస్తుతం యురోపియన్ దేశాల ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ డివిజన్‌లో భాగంగా వుంది. ఈ విమానాలను వైద్య పరమైన తరలింపులకు, విపత్తు సమయాల్లో, సముద్ర జలాల్లో గస్తీకి ఉపయోగిస్తారు.

భారత్ పర్యటనలో స్పెయిన్ ప్రధాని

స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ భారత్ పర్యటనలో భాగంగా సోమవారం తెల్లవారుజామున వడోదర నగరానికి చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి సోమవారం ఉదయం రోడ్‌షోలో పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం శాంచెజ్ స్పెయిన్‌కు తిరిగి బయలుదేరుతారు.

డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



జనాభా లెక్కల వివరాలు వెలువడిన తరువాత 2026 నాటికి జరగాల్సిన డీలిమిటేషన్ కసరత్తుతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందో లేదో చూడాలి. ఉత్తరాది రాష్ట్రాల మాదిరి కాకుండా జనాభా నియంత్రణలో విజయం సాధించినందున తమ రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలను కోల్పోయే అవకాశం ఉందని, తద్వారా తమ రాజకీయ పలుకుబడిపై దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త డేటాతో డీలిమిటేషన్ నిర్వహిస్తే దక్షిణాది రాష్ట్రాలు ప్రస్తుత నియోజకవర్గాల కంటే తక్కువ సంఖ్యలో పార్లమెంటు స్థానాలను పొందవచ్చని వారు భావిస్తున్నారు. మరోవైపు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం '2026 తరువాత జరిగిన మొదటి జనాభా లెక్కల సంబంధిత గణాంకాలు ప్రచురించబడే వరకు, అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల కేటాయింపు జరగదు. 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలకు తిరిగి సర్దుబాటు చేశారు' అని పేర్కొంది. జనాభా గణనను 2025లో నిర్వహించి, 2026లో డేటాను ప్రచురించినట్లయితే, 2025 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తు చేయడం సాధ్యం కాదు. అలా జరిగితే ఆర్టికల్ 82ను సవరించాలని మరికొంత మంది నిపుణులు చెబుతున్నారు. 'డీలిమిటేషన్‌పై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ పరిశీలించాల్సి ఉంటుంది' అని ఆయా వర్గాలు తెలిపాయి.

ఏయే ప్రశ్నలంటే?

జనాభా గణన ప్రక్రియలో ప్రతి కుటుంబానికి అడిగే 31 ప్రశ్నల్లో సాధారణంగా కుటుంబంలో నివసించే వ్యక్తుల సంఖ్య, కుటుంబ పెద్ద మహిళా? కాదా?, కుటుంబంలో ప్రత్యేకంగా నివాసం ఉండే గదుల సంఖ్య, వివాహిత జంటలు ఇతరులతోపాటు ఇంటిలో నివసిస్తున్నారనే ప్రశ్నలు ఉంటాయి. ఒక కుటుంబానికి టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్, మొబైల్ లేదా స్మార్ట్‌ఫోన్, సైకిల్, స్కూటర్ లేదా మోటార్‌సైకిల్ లేదా మోపెడ్ ఉందా? వారు కారు, జీప్ లేదా వ్యాన్ కలిగి ఉన్నారా? అని కూడా ప్రశ్నలు ఉంటాయి. పౌరులు ఇంట్లో తినే తృణధాన్యాలు ఏమిటి, తాగునీటికి ప్రధాన వనరులు, ప్రధాన వెలుతురు, మరుగుదొడ్లు ఉన్నాయా?, మరుగుదొడ్డి రకం, వ్యర్థ జలాల అవుట్‌లెట్, స్నానపు సౌకర్యాల లభ్యత, వంటగది, ఎల్‌పిజి, పిఎన్‌జి కనెక్షన్, వంట కోసం ఉపయోగించే ప్రధాన ఇంధనం, రేడియో, ట్రాన్సిస్టర్, టెలివిజన్ లభ్యత మొదలైన వాటి గురించి కూడా అడుగుతారు.

2011 జనాభా లెక్కల అంశాలు

భారతదేశ జనాభా గణన ప్రతి దశాబ్దానికి నమోదవుతుంది. మొదటిది 1872లో జరిగింది. స్వాతంత్ర్యం తరువాత మొదటి జనాభా గణన 1951లో జరగ్గా, చివరిది 2011లో జరిగింది. 2011 డేటా ప్రకారం, దేశం మొత్తం జనాభా 121 కోట్లు, లింగ నిష్పత్తి 1,000 పురుషులకు 940 స్త్రీలు, అక్షరాస్యత రేటు 74.04 శాతం, 2001 నుండి 2011 వరకు జనాభా పెరుగుదల 17.64 శాతం ఉంది. జనాభాలో మొత్తం 68.84 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. 31.16 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దేశంలో 28 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ దాదాపు 20 కోట్ల జనాభాతో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా నమోదైంది. 64,429 జనాభాతో అతి తక్కువ జనాభా కలిగిన కేంద్ర పాలిత ప్రాంతం లక్షద్వీప్ నమోదైంది. రాజస్థాన్ 3,42,239 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో భౌగోళికంగా అతిపెద్ద రాష్ట్రం కాగా, గోవా 3,702 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో అతి చిన్న రాష్ట్రంగా నమోదైంది.

పెరిగిన కులవివక్ష, దాడులు

- కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కులవివక్ష పెరిగిందని, దళితులపై కులదురహంకార దాడులు పెరిగాయని కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు ముద్దాయిలపై ఉన్న ప్రేమ బాధితులపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్దాయిలను కాపాడేందుకు కేసులు కట్టకుండా రాజీలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని కెవిపిఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే దళిత డాక్టర్‌ను తిట్టి తన అనుచరులతో దాడి చేయిస్తే పోలీసులు కేసు నమోదు చేయకుండా రాజీ చేశారని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా కల్లుగుంట గ్రామంలో దళిత యువకుడు బలహీనవర్గాల అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే కారణంతో అతనిపై దాడి చేసి సాంఘిక బహిష్కరణ చేశారని తెలిపారు. దళితులపై దాడులు జరుగుతుంటే హోంమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. ఇకపై దళితులపై దాడులు జరగవని చెప్పిన సిఎం చంద్రబాబు మాటలు ఏమయ్యాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను అన్ని రకాల స్థాయిల్లో జరపాలని డిమాండ్ చేశారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. జైలులో కులాలను బట్టి పనులు కేటాయించడం దుర్మార్గమైన కులదురహంకార చర్య అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి చర్యలు తీసుకునేందుకు పరిశీలించాలని కోరారు. సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా వచ్చిన రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, ప్రమోషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో విడుదలయ్యే డిఎస్‌సి నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి దళిత, గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్–1, 2 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం సహాయ కార్యదర్శి జి క్రాంతికుమార్, నాయకులు చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

26న దేశవ్యాప్త ఆందోళనలు

- ఉపాధి హామీకి ఆధార్ అనుసంధానం వద్దు : వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నవంబరు 26న దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నట్లు ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పేర్కొన్నారు. సోమవారం నాడిక్కడ ఎపి భవన్‌లో బి వెంకట్ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్త ఆందోళనలో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీకి ఆధార్‌ను అనుసంధానం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. గత కొన్ని నెలల్లోనే ఉపాధి హామీ పథకంలో ఆరు కోట్ల మందిని తొలగించారని తెలిపారు. చాలా మంది ఉపాధి హామీ కార్డులను అర్హత లేదని రద్దు చేశారన్నారు. సుప్రీంకోర్టులో ఆధార్ గురించి కేంద్రం చెప్పిన సమాధానం ప్రకారం.. ఆధార్ సమాచారం కోసం మాత్రమేనని, ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. ఆధార్ ఆధారంగా ఉపాధి హామీ వేతనాలు ఇస్తామని నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. దేశంలో 25 కోట్ల మందికిపైగా ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉన్నారని లెక్కలు చెబుతున్నాయని, ఇంకా స్మార్ట్ ఫోన్లకు వృద్ధులు, మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలు దూరంగా ఉన్నారని తెలిపారు. ఉపాధి హామీని బలహీనపరచడానికే కేంద్రం పని దినాలు తగ్గించిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మరింత అన్యాయంగా ఉపాధి హామీ పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 30 లక్షల మందికి ఉపాధి హామీ రద్దు చేశారని, దళితులకు 15.5 శాతం పని దినాలు తగ్గాయంటే బిజెపి దుర్మార్గం అర్థమవు తుందని అన్నారు. ఉపాధి హామీ విషయంలో తెలుగు రాష్ట్రాల సిఎంలు స్పందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఉపాధి కల్పన, పేదరికం, భూమి, ఇళ్ల వంటి వాటిపై పోరాటం చేస్తామన్నారు.

లెబనాన్ పోర్టు సిటీపై బాంబుల వర్షం

- కొనసాగుతున్న ఇజ్రాయిల్ ఘాతుకాలు
- ఏడుగురు మృతి, 17మందికి గాయాలు
- నగరాన్ని కమ్మేసిన పొగ, దుమ్ము ధూళి
- గాజాలో 22మంది మృతి, వందలాదిమంది అరెస్టు
- రెండు రోజుల కాల్పుల విరమణకు ఈజిప్టు ప్రతిపాదన



గాజా/ బీరుట్ : లెబనాన్ పోర్ట్ సిటీ టైర్‌పై ఇజ్రాయిల్ బలగాలు వరుస వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. బాంబుల హోరు, దట్టమైన పొగ, దుమ్ము ధూళి నగరాన్ని కమ్మేసింది. ఈ దాడుల్లో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, 17మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. చారిత్రక నగరాన్ని నేలమట్టం చేయాలన్నదే ఇజ్రాయిల్ లక్ష్యంగా కనిపిస్తోంది. నగరంలో నివాస ప్రాంతాల్లో ఐదారుసార్లు వైమానిక దాడులు జరిగాయి. మొదటి రెండు దాడుల్లో నివాస భవనాలు పేకమేడల్లా కూలిపోవడం కనిపించిందని స్థానిక మీడియా తెలిపింది. ఇదిలావుండగా లెబనాన్‌లో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని యురోపియన్ యూనియన్ పిలుపిచ్చింది.

గాజాలో 22 మంది మృతి

సోమవారం ఉదయం నుండి గాజాలో జరిగిన దాడుల్లో 22మంది మరణించారు. వారిలో 13మంది ఉత్తర గాజా దాడుల్లో చనిపోయారని వైద్య వర్గాలు తెలిపాయి. గత 48గంటల్లో 96మంది మరణించారని పేర్కొన్నాయి. ఉత్తర గాజాలోని ప్రాంతాల నుండి, జాబాలియా శరణార్థ శిబిరం నుండి దాదాపు 600మంది పాలస్తీనియన్లను అరెస్టు చేసినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ రేడియో తెలిపింది. గాజా నగరంలోని సాబ్రా ఏరియాలో ఇద్దరు మరణించగా, రఫా నగరంలో రెండు మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ గాజాలోని బురెజి శరణార్థ శిబిరంపై వరుసగా క్షిపణులతో, డ్రోన్‌లతో దాడులు కొనసాగుతున్నాయి. తూర్పు ప్రాంతంలోని తమ ఇళ్ళకు తిరిగివస్తున్న ఒక బృందాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అంతకుముందు సోమవారం తెల్లవారు జామున షుజయె ప్రాంతంలో నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకుని కూడా ఇదే రీతిలో మిలటరీ దాడులు జరిపింది. ముగ్గురు మరణించారు. వారి మృతదేహాలను కొద్ది గంటలు గడిచిన తర్వాత గుర్రపు బండిపై వేసుకుని ఆస్పత్రికి ఒక వలంటీర్ తీసుకెళ్ళడం కనిపించిందని మీడియా పేర్కొంది. ఇప్పటివరకు గాజాలో మరణించిన వారి సంఖ్య 43,020కి చేరుకోగా, గాయపడిన వారి సంఖ్య 1,01,110కి చేరుకుంది. ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిలో దాదాపు వందమందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. వారందరూ ఆస్పత్రి సిబ్బందేనని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

ఈజిప్ట్ ప్రతిపాదన

గాజాలో రెండు రోజుల పాటు కాల్పుల విరమణ జరగాలని, ఈ సమయంలో నలుగురు బందీలను విడుదల చేయాలని ప్రతిపాదించినట్లు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా అల్ శిశి తెలిపారు. దీనిపై ఇరు పక్షాలనుండి వెంటనే ఎలాంటి స్పందన తెలియరాలేదు. అలాగే పాలస్తీనా ఖైదీలను కూడా కొంతమందిని విడుదల చేయాలని, గాజాకు మానవతా సాయాన్ని పంపాలని కూడా ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. శాశ్వత కాల్పుల విరమణ కోసం చర్చలు కొనసాగాలని, అందుకోసం పరిస్థితులను కాస్తంత ముందుకు తీసుకెళ్ళాలంటే ఈ ప్రతిపాదనలు అమలు చేయాలని ఆయన సూచించారు.

ఖమేని ఖాతా సస్పెన్షన్

ఇరాన్ సుప్రీం నేత అయిన ఆయతుల్లా అలీ ఖమేని కొత్త సోషల్ మీడియా ఖాతాను ఎక్స్ సస్పెండ్ చేసింది. ఆ ఖాతాలో హీబ్రూలో పోస్టులు పెడుతూ వుంటారు. ఎక్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ ఖాతాను నిలుపుచేసినట్లు ఎక్స్ పేర్కొంది. అయితే ఆ ఉల్లంఘన ఏమిటన్నది వెంటనే తెలియరాలేదు.

ఇరాన్ సైనిక స్థావరాలపై దాడి దృశ్యాలు విడుదల

ఇరాన్ రాజధాని టెహరాన్‌కు ఆగ్నేయంగా గల ఒక రహస్య సైనిక స్థావరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడికి సంబంధించిన శాటిలైట్ దృశ్యాలు విడుదలయ్యాయి. ఈ దాడుల్లో ఆ స్థావరంలోని పలు భవనాలు ధ్వంసమైనట్లు కనిపిస్తోంది. సమీపంలోని ఖోజీర్ సైనిక స్థావరంలో కూడా కొన్ని భవనాలు ధ్వంసమయ్యాయి.

ఈ ప్రాంతంలో భూగర్భ సొరంగ వ్యవస్థ, క్షిపణి తయారీ ప్రదేశాలు వున్నాయని, వాటిని బయటి ప్రపంచానికి తెలియకుండా ఇరాన్ దాచిపెట్టిందని ఇజ్రాయిల్ ఆరోపించింది. సైనిక స్థావరాలపై దాడి జరిగిందన్న విషయాన్ని ఇరాన్ ధ్రువీకరించలేదు. ఇజ్రాయిల్ దాడిలో వైమానిక రక్షణ వ్యవస్థలో పనిచేస్తున్న నలుగురు ఇరాన్ సైనికులతో పాటు ఓ పౌరుడు మరణించినట్లు ప్రకటించింది. మృతుల వివరాలను వెల్లడించలేదు. ఇరాన్ రాజధాని టెహరాన్‌కు నైరుతి, పశ్చిమప్రాంతాల్లోని వైమానిక, సైనిక స్థావరాలపై శనివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే.

జపాన్ ప్రతినిధుల సభకు రికార్డు సంఖ్యలో మహిళలు

టోక్యో : జపాన్ ప్రతినిధుల సభకు రికార్డు సంఖ్యలో మహిళలు ఎన్నికయ్యారు. అయినా కూడా వీరి సంఖ్య 16శాతం కన్నా తక్కువే ఉంది. పార్లమెంటు దిగువ సభలోని మొత్తం 465 స్థానాలకు గాను మహిళలు 73 స్థానాలను గెలుచుకున్నారని ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కె పేర్కొంది. 2021లో జరిగిన ఎన్నికల్లో 45మంది మహిళలు మాత్రమే ఎన్నికయ్యారు. జపాన్‌లో వ్యాపార, రాజకీయ రంగాల్లో మహిళా నేతలు ఇప్పటికీ అరుదనే చెప్పాలి. ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వేదిక వెలువరించిన అంతర్జాతీయ లింగ నిష్పత్తిపై నివేదిక ప్రకారం 146 దేశాల జాబితాలో జపాన్ 118వ స్థానంలో వుంది. ప్రస్తుత కేబినెట్‌లో ఇద్దరు మహిళలు మాత్రమే వున్నారు. జపాన్‌లో రాజకీయ పార్టీలన్నీ పురుషాధిక్యతతోనే వుంటాయని, అరమరికలు లేని రీతిలో పనిచేయవని, అందువల్ల మహిళా అభ్యర్థులు వుండడం కష్టమవుతుందని 'నో యూత్ నో జపాన్' అధ్యక్షురాలు మొమొకొ నొజో గత నెలలో పాలక పార్టీ నాయకత్వ ఎన్నికల ముందు వ్యాఖ్యానించారు. 2021లో కేబినెట్ ఆఫీస్ నిర్వహించిన సర్వే ప్రకారం, జపాన్‌లో మహిళా అభ్యర్థుల్లో ప్రతి నలుగురిలో ఒకరు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని జిజి ప్రెస్ పేర్కొంది.

మొరేల్స్‌పై హత్యాయత్నం!

- అధ్యక్షుడు ఆర్సె ఖండన



లాపాజ్ : బొలీవియా మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్‌పై గుర్తుతెలియని దుండగులు హత్యాయత్నం చేశారు. ఆదివారం కారులో వెళుండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపారు. ఈ దాడి నుంచి ఆయన సురక్షితంగా బయటపడ్డారు. ఇది అధ్యక్షుడు లూయిస్ ఆర్సె పనేనని మొరేల్స్ విమర్శించారు. రాజకీయాల నుండి తనను పక్కకు తప్పించాలన్నది ప్రభుత్వ కుట్రగా వుందని, అందుకే వారు ఇటువంటి కుట్రలు పన్నుతున్నారని మొరేల్స్ విమర్శించారు. ఫాసిస్ట్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం మనం ఉన్నామనడానికి స్పష్టమైన ఆధారాలున్నాయని మొరేల్స్‌కి చెందిన ఎంఎఎస్ చీలిక గ్రూపు ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. నల్ల దుస్తులు ధరించి, భారీగా ఆయుధాలు కలిగిన వ్యక్తులు రెండు వాహనాల్లో వచ్చి మొరేల్స్ కాన్వాయ్‌పై కాపుగాచి దాడి చేశారని ఆ ప్రకటన పేర్కొంది. మొరేల్స్ తలకు కొద్ది సెంటిమీటర్ల దూరం నుండి బుల్లెట్లు వెళ్లాయని, ఆయనకు తృటిలో ప్రాణాపాయం తప్పిందని తెలిపింది. ఇందుకు సంబంధించి వీడియో విడుదల చేసింది. ఈ సంఘటన జరిగినప్పుడు గగనతలంలో హెలికాప్టర్ల రొద కూడా వీడియోలో వినిపిస్తోంది. ఈ దాడిని అధ్యక్షుడు ఆర్సే ఖండించారు. వ్యక్తులను అంతమొందించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పార్టీకి ఎవరు నేతృత్వం వహించాలనే విషయంలో మొరేల్స్, ఆర్సేల మధ్య ఘర్షణ తలెత్తింది. మొరేల్స్ ప్రభుత్వ హయాంలో ఆర్సె ఆర్థిక మంత్రిగా పనిచేశారు.



గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఇటలీ అంతటా ప్రదర్శనల హోరు

రోమ్ : మధ్య ప్రాచ్యంలో, ఉక్రెయిన్‌లో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరుతూ ఇటలీ వ్యాప్తంగా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అంతర్జాతీయంగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలకు స్వస్తి పలకాలని వారు డిమాండ్ చేశారు. రోమ్, టురిన్, మిలాన్, ఫ్లోరెన్స్, బరి, పాలెర్మో, కాగ్లిరి నగరాల్లో శాంతియుతంగా ర్యాలీలు శనివారం జరిగాయి. శాంతికి, నిరాయుధీకరణకు, మానవ హక్కులకు కట్టుబడిన వందలాది గ్రూపులు, సంస్థలు ఈ ర్యాలీలకు మద్దతునిచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ఘర్షణలు, హింసకు తక్షణమే స్వస్తి పలకాలని వారు కోరారు. పరిస్థితులు ఇంతలా వున్నా ఐక్యరాజ్య సమితి ప్రభావవంతమైన రీతిలో వ్యవహరించకపోవడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. రోమ్‌లో భారీ పతాకాన్ని చేబూని వేలాదిమంది ప్రజలు ప్రదర్శన చేశారు. మనందరం కలిసి యుద్ధాలను నివారిద్దాం, శాంతికి సమయం ఆసన్నమైందని అంటూ నినాదాలు చేశారు. ఏళ్ళ తరబడి ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగుతోందని, ఫలితం ఏమిటని ఒక ప్రదర్శకుడు ప్రశ్నించారు. అనేకమంది సైనికులతో సహా పెద్ద సంఖ్యలో ఇరు పక్షాలకు చెందిన ప్రజలు, పిల్లలు మరణించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా, లెబనాన్‌ల్లో కూడా ఇదే పరిస్థితని అన్నారు. చర్చలు, దౌత్యం కాల్పుల విరమణ వంటి పంథాను మనం తప్పక అనుసరించాలని, యుద్ధాలతో, ఘర్షణలతో లాభం లేదని ర్యాలీ నిర్వాహకుడు గిలియో మాక్రాన్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ఆరోగ్య హక్కు చట్టం

- అమలు చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆరోగ్య హక్కు చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య వేదిక కోరింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం విజయవాడలో కలిసి వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు కెవిఎస్ సాయిప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య హక్కు చట్టం అమలుపై తాము రాజకీయ పార్టీలు, యూనియన్లు, నిపుణులు, బహుజన సంస్థలతో సహా విభిన్న వాటాదారులతో విస్తృతమైన సంప్రదింపులు నిర్వహించామని పేర్కొన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, జవాబుదారీతనం, ఆరోగ్య ఈక్విటీకి సార్వత్రిక ప్రాప్యతను నిర్ధారించడానికి ఆరోగ్య హక్కు చట్టం కీలకమైందని పేర్కొన్నారు. తమ ప్రతిపాదనలను పరిశీలించి కీలకమైన చట్టాన్ని రూపొందించాలని కోరారు.



నెతన్యాహుకు వ్యతిరేకంగా నినదిస్తున్న ఇజ్రాయిలీ నిరసనకారులు

నెతన్యాహుకు నిరసన సెగ

- ప్రసంగాన్ని అడ్డుకున్న నిరసనకారులు

టెల్అవీవ్: ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు సొంత గడ్డపైనే నిరసనల సెగ తగిలింది. ఆదివారం జెరూసలెంలోని మౌంట్ హెర్జిల్ మిలిటరీ సమాధి వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మట్లాడుతుండగా ఇజ్రాయిలీయులు పెద్దయెత్తున నిరసన తెలిపారు. మీ ప్రసంగం ఆపండంటూ నిరసనకారులు గళమెత్తడంతో నెతన్యాహు కంగుతిన్నాడు. దక్షిణ ఇజ్రాయిల్‌పై గత ఏడాది హమాస్ జరిపిన దాడిలో మరణించినవారికి నివాళులర్పించే పేరుతో నెతన్యాహు జాతీయోన్మాదాన్ని రెచ్చటొట్టేలా ప్రసంగించారు. దీనికి సభలో ఉన్నవారు ఒక్కసారిగా లేచి మీరు జాతికే సిగ్గుచేటు అని గట్టిగా అరిచారు. మీ వల్లే మా తండ్రి చనిపోయాడని ఇంకొకాయన అరిచాడు. గాజా, లెబనాన్‌ల రక్తపాతానికి మీరే కారణం, బందీలు ఇప్పటికీ విడుదల కాకపోవడానికి మీరే బాధ్యులు అంటూ నెతన్యాహును వారు విమర్శించారు.

వైసిపి బాటలో కూటమి సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీల ఉనికికే నష్టమని, మిగతా రాష్ట్రాల అనుభవం ఇదేనని తెలిపారు. లేని సమస్యలను సృష్టించి మతం పేరుతో ప్రజల మధ్య ఘర్షణలు పెడుతున్నారని విమర్శించారు. ప్రజల తరపున నిలబడి మత సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షంపై ఉందన్నారు.

త్వరలో కార్యాచరణ

విద్యుత్ ఛార్జీలు, ఇసుక, మద్యం విషయంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానాలపై త్వరలో పది వామపక్ష పార్టీలు విజయవాడలో సమావేశమై చర్చిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలోనే ఉమ్మడి కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై విమర్శించే అర్హత వైసిపికి లేదన్నారు. ఆ పార్టీ హయాంలోనే విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన వచ్చిందని తెలిపారు. ఉచిత ఇసుకను ప్రైవేటు వాళ్లకు అప్పగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ప్రభుత్వమే నిర్వహించి ప్రజలను, స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజాసంఘాలను అందులో భాగస్వామ్యం చేయడం ద్వారా ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయొచ్చని సూచించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ జీడి, కొబ్బరి పంటలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. జీడి, కొబ్బరి పంటలను అభివృద్ధి చేయడంతో పాటు కొనుగోలుకు అవకాశాలు కల్పించాలని కోరారు. కేరళలో జీడి, కొబ్బరి వంటలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నా మన రాష్ట్రంలో మాత్రం ఈ పంటలను పట్టించుకోవడం లేదన్నారు. జీడి పరిశ్రమలను అభివృద్ధి చేయాలని, కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జి.సింహాచలం పాల్గొన్నారు.

'ఫెర్రో'పై సర్దుబాటు పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. సామర్థ్యాన్ని బట్టి ఆయా పరిశ్రమలపై విద్యుత్తు ఛార్జీల భారం కూడా పెరగనుందని ఆయా యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి విద్యుత్తు ఛార్జీల భారం నుంచి ఫెర్రో పరిశ్రమలకు మినహాయించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

మూతదిశగా 'ఫెర్రో' పరిశ్రమలు

విద్యుత్తు ఛార్జీల భారంతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతదిశగా వెళున్నాయి. రాష్ట్రంలోని ఫెర్రో పరిశ్రమల్లో దాదాపు 60 వేల మందికిపైగా కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. అందులో అత్యధికంగా ఫెర్రో పరిశ్రమలు విజయనగరం జిల్లాలోనే ఉన్నాయి. విద్యుత్తు ఛార్జీల భారంతో పరిశ్రమలు మూతపడితే జిల్లాలోని కార్మికులు రోడ్డున పడే ప్రమాదముంది. ఇప్పటికే విజయనగరం జిల్లాలో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్లో ఇంపెక్స్, సిరి, యోనా పరిశ్రమలు మూతపడడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల భారం ప్రస్తుతం నడుస్తున్న బెర్రీ, విక్టోరియా, సహారా, అరోరా, ఎండిఎ, హిరా ఫెర్రో పరిశ్రమలపై పడడంతో ఆయా పరిశ్రమలు మూత పడతాయేమోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలను ఉపసంహరించాలని కార్మికులూ కోరుతున్నారు.

సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించాలి

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ విధానాలు మారడం లేదు. వైసిపి హయాంలో విద్యుత్తు ఛార్జీలు పెంచితే వ్యతిరేకించిన టిడిపి కూటమి నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చాక భారం వేశారు. విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపడం అన్యాయం. పెంచిన విద్యుత్తు ఛార్జీలు ఉపసంహరించి పరిశ్రమలను బతికించాలి. కార్మికుల ఉపాధి కోల్పోకుండా చూడాలి.

– పి.శంకరరావు, సిఐటియు విజయనగరం జిల్లా అధ్యక్షులు

మొదటి బెల్ట్ గెలిచాను



హాయ్ ఫ్రెండ్స్, నా పేరు లోహిత. నేను మా పాఠశాలలో తీసుకున్న ఈసీఏ (ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీ..చదువుతోపాటు అదనంగా నేర్చుకునేది) కరాటే. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం మరికొన్ని బ్లాక్స్, పంచెస్, కిక్కులు వంటివి చాలా టెక్నిక్స్ నేర్చుకున్నాను. మమ్మల్ని మేము రక్షించుకునే ఈ కరాటే నేర్చుకోవడం నాకు చాలా ఇష్టం. మా క్లాస్‌లో అబ్బాయిలతో సమానంగా మేమూ నేర్చుకుంటున్నాము. గమ్మత్తైన విషయమేమంటే అబ్బాయిల కన్నా మేమే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నామని మా మాస్టారు చాలాసార్లు అన్నారు. ఈ సంవత్సరం టెస్టులో నేను మొదటిస్టేజ్‌లో పాల్గొన్నాను. ఎల్లో బెల్ట్ కూడా పొందాను. చాలా సంతోషంగా ఉంది. ఇలా మాకెన్నో టెక్నిక్స్‌ను తెలియజేస్తూ మమ్మల్ని ముందుకు తీసుకెళ్తున్న మా సార్‌కు మేము ఎన్నో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా ఎవరైనా ఈ విద్యను నేర్చుకోవచ్చు.



– వి. లోహిత
9వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.

దారిలో సెల్ ఫోన్



గోపీ అనంతవరం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. గోపీకి చదువుకోవడం చాలా ఇష్టం. తల్లి దండ్రులు, గురువులు చెప్పిన మాటలు తప్పకుండా పాటిస్తాడు. ఒక రోజు పాఠశాలకు వెళ్తుండగా దారిలో సెల్ ఫోన్ దొరికింది. గోపీ దానిని తీసుకోని ఇటు అటు చూసాడు. అప్పుడు ఒక పెద్దాయన చాలా కంగారుగా దూరం నుండి అటు ఇటు చూస్తూ వస్తున్నాడు. గోపీ అతని దగ్గరికి వెళ్ళి 'ఈ సెల్ ఫోన్ మీదేనా' అని అడిగాడు. అది చూసి 'నాదే, దారిలో వెళ్తున్నప్పుడు పడిపోయింది' అన్నాడు పెద్దాయన. గోపీ ఆ ఫోను అతనికి ఇచ్చేశాడు. అప్పుడు ఆ వ్యక్తి ఎంతో సంతోషంతో గోపీకి వంద రూపాయలు ఇవ్వబోయాడు. కానీ గోపి ఆ డబ్బులు తీసుకోలేదు.


ఆ రోజు తరగతి గదిలో ఉపాధ్యాయుడు 'ఈ వారంలో మీరు చేసిన మంచి పనులు చెప్పండి' అని ఒక్కొక్కరిని అడిగారు. విద్యార్థులు తమ ఇంట్లో అమ్మానాన్నకు తాము చేసిన పనులు చెప్పారు. గోపీ సెల్ ఫోన్ విషయం చెప్పాడు. 'శభాష్ గోపి, ఇతరుల వస్తువులు ఎప్పుడూ తీసుకోకూడదు. ఒక వేళ దొరికితే వారికే తిరిగి ఇవ్వాలి. మంచి పని చేసావు' అంటూ ఉపాధ్యాయుడు మెచ్చుకున్నారు. జేబులో నుండి పెన్ను తీసి తనకి బహుమతిగా కూడా ఇచ్చారు. తోటి విద్యార్థులు కూడా గోపీని అభినందించారు.



మల్లు గారి అక్షయ,
7వ తరగతి,
జక్కాపూర్ ఉన్నత పాఠశాల,
సిద్దిపేట జిల్లా.

నేను గీసిన బొమ్మ





బి.వసుశ్రీ,
10వ.తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రామభద్రపురం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



మీకోసం

స్టీలు డబ్బాలు, కప్‌బోర్డులపై పడిన జిడ్డు మరకలు పోవాలంటే ఒక కర్చీఫ్‌లో కొంచెం బియ్యం అందులో టూత్ పౌడర్ వేసి మూటలా కట్టుకోవాలి. ఈ మూటతో వాటిపై రుద్దాలి. తరువాత మెత్తని వస్త్రంతో మరోసారి రుద్దితే మరకలు పోతాయి.

జీవన సౌరభం

విజయం కోసం చేసే ప్రతి ప్రయత్నమూ సఫలం కాకపోవచ్చు. కానీ ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.




దీపావళి రోజు ఇలా జాగ్రత్తలు తీసుకుందాం..

కొన్నిరోజుల్లో దీపావళి పండుగ వస్తోంది. పండగ సందర్భంగా బాణాసంచా కాల్చడం ఈమధ్య కాలం బాగా ఎక్కువైంది. ఇప్పటికే ఢిల్లీ, హర్యానా వంటి రాష్ట్రాల్లో వాయు కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ వాయు కాలుష్యం కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అలా జరగకుండా ఉండేందుకు కొన్ని విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

- బాణాసంచా కాల్చేటప్పుడు పిల్లలు, పెద్దలు మాస్క్ తప్పనిసరిగా ధరించాలి.
- వాయు కాలుష్యం ఇంట్లోని గాలిపై కూడా ప్రభావం చూపుతుంది. కాబట్టి ఇంటి లోపల మంచి గాలి నాణ్యతను నిర్వహించడానికి ఎయిర్ ప్యూరిఫైయర్‌ను ఉపయోగించాలి.
- వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటే, ఇంటి కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. దీని వల్ల బయటి కాలుష్యం ఇంట్లోకి ప్రవేశించకుండా ఇంటి లోపల గాలి స్వచ్ఛంగా ఉంటుంది.
- అధిక స్థాయి వాయు కాలుష్యం కారణంగా శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతాయి. అటువంటి పరిస్థితుల్లో పుష్కలంగా నీరు తాగాలి. తద్వారా శ్వాస వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది.
- కాలుష్యానికి ఎక్కువగా ప్రభావితం కాకుండా ఉండాలంటే, అల్లం, పసుపు, తేనె, సిట్రస్ పండ్లను ఎక్కువగా తినాలి. వాటిలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.. ఇవి మన శరీరంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి.

బియ్యం కడిగిన నీళ్లు.. ఎంతో మేలు



సాధారణంగా బియ్యం కడిగిన నీళ్లను అందరూ పారబోస్తారు. అయితే ఈ నీళ్లల్లో అనేక పోషకాలు, ఖనిజాలతోపాటు యాంటి ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. ఇంకా అనేక ఉపయోగాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం.

- బియ్యం కడిగిన నీళ్లలో ఉండే విటమిన్ బి, చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. ఇందులోని యాంటి ఆక్సిడెంట్లు.. చర్మంలోని మృతకణాలను తొలగించడంతోపాటు కొత్త కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తాయి.
- ఈ నీళ్లతో నిత్యం ముఖం శుభ్రపరుచుకుంటే చర్మంపై మొటిమలు, నల్ల మచ్చలు తగ్గుముఖం పడతాయి. చర్మం మృదువుగా, తేజోవంతంగా మారుతుంది.
- బియ్యం నీటిలో ఉండే ఫెరులిక్ యాసిడ్.. చర్మం ముడతలు పడకుండా చూస్తుంది. వృద్ధాప్య లక్షణాలను తగ్గిస్తుంది.
- చర్మంలో తేమను కాపాడటంలో బియ్యం నీళ్ల సాయపడతాయి. ఇందులోని అమైనో ఆమ్లాలు, యాంటి ఆక్సిడెంట్లు, చర్మం పొడిబారకుండా చేస్తాయి.
- బియ్యం నీటిని ఫేషియల్ టోనర్‌గానూ ఉపయోగించవచ్చు. దీనివల్ల చర్మం కోమలంగా తయారవుతుంది.
- జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ బియ్యం నీళ్ల సమర్థంగా పనిచేస్తాయి. బియ్యం నీటితో జుట్టును శుభ్రం చేసుకుంటే.. కేశాలకు కొత్త మెరుపు రావడంతోపాటు జుట్టు రాలడం కూడా తగ్గుతుంది.

ఈ కషాయంతో రోగాలు దూరం



దాల్చిన చెక్క, లవంగాలు, జీలకర్ర, కొత్తిమీరను సాధారణంగా ఆహారం రుచిని పెంచడానికి సుగంధ ద్రవ్యాలుగా ఉపయోగిస్తాం. అయితే ఈ పదార్థాలలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి అనేక సమస్యల నుండి శరీరాన్ని రక్షిస్తాయి. శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వీటితో కషాయాలను తయారు చేసుకుని తాగితే, రోగనిరోధక శక్తి బలోపేతం అవుతుంది.

మలబద్ధకం : మలబద్ధకం సమస్యతో బాధపడుతుంటే రాత్రి పడుకునే ముందు వేడి నీటిలో దాల్చిన చెక్క, లవంగాలు, జీలకర్ర, కొత్తిమీర వేసి కషాయం తయారుచేసుకుని తాగాలి. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. అజీర్ణం నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

డి టాక్సేషన్ : శరీరం డి టాక్సేషన్‌కి గురికాకుండా ఉండాలంటే ఈ పదార్థాలతో చేసుకున్న కషాయాన్ని ప్రతిరోజూ తాగాలి. ఇలా చేస్తే శరీరంలోని విషపదార్థాలు బయటికి పోతాయి.

ఊబకాయం : శరీర బరువును తగ్గించడంలో కూడా ఈ కషాయం బాగా ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తాగడం వల్ల శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది.

రోగనిరోధక శక్తి : ఈ కషాయంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే అనేక లక్షణాలు ఉన్నాయి.

జలుబు, దగ్గు : చలికాలంలో వచ్చే సమస్యల్లో జలుబు, దగ్గు ఒకటి. ఈ సమస్యకు దూరంగా ఉండాలంటే ఈ కషాయాన్ని ప్రతిరోజూ తాగాలి.

చిరంజీవికి ఎఎన్ఆర్ జాతీయ పురస్కారం


ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మెగాస్టార్ చిరంజీవి బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా ఎఎన్ఆర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. 2024 సంవత్సరానికి గాను ఈ అవార్డును చిరంజీవికి ప్రకటించారు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన అక్కినేని జాతీయ పురస్కార వేడుకకు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా నాగార్జున ఈ అవార్డును ప్రకటించారు. చిరంజీవి మాట్లాడుతూ..నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత అమితాబ్ బచ్చన్‌కు ముందుగా ధన్యవాదాలు. నాకు ఎప్పుడు ఏ మంచి జరిగినా, నాకు ఎప్పుడైనా అవార్డు వచ్చినా ఆయన నుంచే తొలుతగా నాకు శుభాకాంక్షలు వస్తాయి. కొన్నిసార్లు ఇలా వచ్చి ఆశీర్వదిస్తుంటారు. ఆయన లాంటి బిగ్ స్టార్ నాకు ఈ అవార్డు ప్రదానం చేయడం ఆనందదాయకం" అని అన్నారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి కుటుంబ సభ్యులు, నాగార్జున కుటుంబ సభ్యులతో పాటు సినీ రంగానికి చెందిన పలువురు హాజరయ్యారు.




పురస్కార గ్రహీత చిరంజీవితో అమితాబ్, నాగార్జున తదితరులు

వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్‌లో



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రాబోతున్న ఎస్ఎస్ఎంబీ 29 వచ్చే ఏడాది ప్రారంభం నుండి సెట్స్‌పైకి వెళ్లనుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటికి వచ్చింది. ఈ సినిమా రూ.1000 కోట్ల బడ్జెట్‌తో, రెండు పార్టులుగా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకున్నారు. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



'మట్కా' అజయ్‌ఘోష్

వరుణ్ తేజ్ నటిస్తున్న 'మట్కా' చిత్రం నవంబరు 14న విడుదలకు సిద్ధంగా ఉంది. కరుణకుమార్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే అజయ్ ఘోష్ కీలక పాత్రలో కనిపిస్తున్నారు. తాజాగా ఆయన పోస్టర్‌ని చిత్రబృందం విడుదలచేసింది. 'గోల్డెన్ హార్ట్ అండ్ అచంచలమైన చిత్తశుద్ధితో కూడిన విధేయతతో కూడిన ఆత్మ.. అంటూ ఈ లుక్ షేర్ చేశారు. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. మట్కాలో కథానుగుణంగా వైజాగ్ బ్యాక్ డ్రాప్‌లో ఉండే పూర్ణా మార్కెట్‌తోపాటు పలు ప్రాంతాలను రీక్రియేట్ చేశారు.

'సంక్రాంతికి వస్తున్నాం..'



హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న కొత్త సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా ఫిల్మ్‌లో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యారాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మాజీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో వెంకటేష్ నటించారు. పోలీసాఫీసర్ భార్యగా ఐశ్వర్యారాజేష్, ఆయన మాజీ ప్రేయసిగా మీనాక్షీచౌదరి నటిస్తున్నారు. ఈ సినిమా డబ్బింగ్ వర్క్స్ ప్రారంభమయ్యాయి. 'ఇప్పటివరకూ జరిపిన షూటింగ్‌తో 90 శాతం సినిమా పూర్తయ్యింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. డబ్బింగ్ కూడా ప్రారంభించాం' అని చిత్ర యూనిట్ పేర్కొంది. 'దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి బరిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి సంగీతం భీమ్స్ సిసిరోలియో.

దక్షిణాఫ్రికా పర్యటనకు

టీమిండియా కోచ్‌గా లక్ష్మణ్



- వెరీ వెరీ స్పెషల్‌కు మరోసారి అవకాశం

ముంబయి: టీమిండియా మాజీ ఆటగాడు, హైదరాబాద్‌కు చెందిన వివిఎస్ లక్ష్మణ్‌కు మరోసారి హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లే భారత జట్టు హెడ్‌కోచ్‌గా వివిఎస్ లక్ష్మణ్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం హెడ్‌కోచ్ గౌతం గంభీర్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆడే భారత బృందానికి బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) అధికారి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. బిసిసిఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. రెండు పర్యటనలు నవంబర్ నెలలోనే ఉన్న దృష్ట్యా ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ పర్యటనను ఇరుదేశాల క్రికెట్ బోర్డులు ఇటీవల ఖరారు చేసుకొన్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక కోచ్ అవసరం ఏర్పడింది. అందుకని బాధ్యత అప్పగించాలని బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది. లక్ష్మణ్‌తో పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ కోచింగ్ బృందం కూడా దక్షిణాఫ్రికా వెళ్లనుంది.

ఇప్పటికే రెండుసార్లు

భారత జట్టు తరపున ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన హైదరాబాదీ లక్ష్మణ్‌కు కోచింగ్‌లో అనుభవం ఉంది. గతంలో ఐర్లాండ్ పర్యటనకు, టి20 ప్రపంచ కప్ తర్వాత జింబాబ్వే టూర్‌కు లక్ష్మణ్ టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా పని చేశాడు. అందుకని ఈసారి గంభీర్ దక్షిణాఫ్రికా పర్యటనకు అందుబాటులో లేకపోవడంతో.. మరో సారి అదే పాత్రను పోషించాల్సిందిగా సెలెక్టర్లు, బిసిసిఐ అధికారులు లక్ష్మణ్‌ను సంప్రదించారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత బృందం దక్షిణాఫ్రికాతో 4 టి20ల సిరీస్ ఆడనుంది.

జట్టు : సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, జితేశ్ శర్మ(వికెట్ కీపర్లు), రింకూ సింగ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమన్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్‌కుమార్, అవేశ్ ఖాన్, యశ్ దయాల్.

టి20 షెడ్యూల్...

నవంబర్ 8 : తొలి టి20(దర్బన్)
నవంబర్ 10 : రెండో టి20(గెబెర్హా)
నవంబర్ 13 : మూడో టి20(సెంచూరియన్)
నవంబర్ 15 : నాల్గో టి20(జొహన్నెస్‌బర్గ్)

ఉత్కంఠ పోరులో టైటాన్స్ గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్-11

హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్‌కు ఊరట లభించింది. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు 28-26పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌ను చిత్తుచేసింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్(5పాయింట్లు) నిరాశపరిచినా.. ట్యాకిల్స్‌లో అంకిత్(4) మెరిసాడు. మరో రైడర్ అశీశ్ నర్వాల్(9) సత్తా చాటాడు ఇక పట్నా జట్టులో దేవాంక్(7), అయాన్(6) రైడ్స్‌లో మెరిసారు. పట్నా పైరేట్స్‌కు మూడు మ్యాచుల్లో ఇది రెండో ఓటమి కాగా.. తెలుగు టైటాన్స్‌కు ఐదు మ్యాచుల్లో ఇది రెండో గెలుపు. అంతకుముందు హర్యానా స్టీలర్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది.



సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో హర్యానా జట్టు 41-34పాయింట్ల తేడాతో దబాంగ్ ఢిల్లీని చిత్తుచేసింది. హర్యానా జట్టులో షడ్రోలీ(10), శివమ్(8) రైడ్ పాయింట్లు సాధించగా.. ఢిల్లీ జట్టులో అన్ను మాలిక్(13పాయింట్లు) సత్తా చాటాడు.

134 పరుగుల ఆధిక్యంలో హిమాచల్

- కెప్టెన్ ధావన్‌కు తృటిలో చేజారిన డబుల్ సెంచరీ

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖపట్నం)



ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యం లో జరుగుతున్న ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ రంజీ ట్రోఫీ మ్యాచ్ విశాఖ పట్నం పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జా తీయ క్రికెట్ స్టేడియంలో మూడో రోజు హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ సోమవారం ప్రారంభమైంది. తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ మూడో రోజు మ్యాచ్ సమయం ముగిసేసరికి 150 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 478 పరుగులు చేసి 134 పరుగులు అధిక్యంలో ఉంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ క్రీడాకారులు ఆకాష్ పి వశిష్ట్ 85 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. జట్టు కెప్టెన్ రిషి ఆర్ ధావన్ గ్రౌండ్లో బ్యాట్ తో చెలరేగిపో యాడు. 318 బంతుల్లో 19 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 195 పరుగులు చేసి డబుల్ సెంచరీకి చేరువలో వికెట్ కోల్పోయాడు. ముకుల్ నేగి 42 పరుగులు చేసి అర్ధ సెంచరీకి చేరువలో అవుట్ అయ్యాడు. లోయర్ ఆర్డర్ లో దిగిన అర్పిత్ ఎన్ గులేరియా 15, దివేశ్ 12 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు.

చిరాగ్‌కు స్వర్ణం

ప్రపంచ (అండర్-23) రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ చిరాగ్ చిక్కర సత్తా చాటారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో చిరాగ్ 4-3పాయింట్ల కరఛౌ(కజకిస్తాన్)ను చిత్తుచేశాడు. మ్యాచ్ మిగియడానికి 2సెకన్ల ముందు చిరాగ్ ఒక పాయింట్ ఆధిక్యతను సంపాదించి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన అమన్ షెహ్రావత్ గత ఏడాది స్వర్ణ పతకం సాధించాడు. భారత్ 82పాయింట్లతో 4వ స్థానంలో నిలిచింది. ఇరాన్(158పాయింట్లు), జపాన్(102), అజర్‌బైజాన్(100) టాప్-3లో ఉన్నాయి. ఇక మహిళల విభాగంలో భారత్‌కు ఒక రజత, మూడు కాంస్య పతకాలు దక్కాయి. 59కిలోల విభాగంలో అంజలి(రజతం), 57కిలోల విభాగంలో నేహా, 65కిలోల విభాగంలో శిక్షా, 68కిలోల విభాగంలో మౌనిక కాంస్య పతకాలను సాధించారు. ఇక పురుషుల 55కిలోల విభాగంలో విశ్వజిత్ 55కిలోల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68